


చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక..
ఈ రెండు సంవత్సరాల కూటమి
ప్రభుత్వంలో పెట్రోల్ మీద గానీ, డీజిల్
మీద గానీ ఒక్కటంటే ఒక్క పైసా కూడా
రేటు పెంచలేదు. జగన్మోహన్ రెడ్డి పెంచిన
పాత ధరల పాపమే ఇప్పటికీ
కొనసాగుతుంటే.. ఆ ధరల మీదే వైసీపీ
ఈరోజు సిగ్గులేకుండా ధర్నాలు చేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 20.05.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 28 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# తీరమ మనదే... మత్స్య సంపదా మనదే....

మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడతాం

చేపల వేటకు సబ్సీడీపై 200 మెకనైజ్డ్ బోట్లు

సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు

నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే

మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్లను పంపిణీ చేసిన సీఎం

నెల్లూరు జిల్లా కావలిలో మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్య కారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్య కార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్ధిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్య కారుల కుటుంబానికి రూ. 20 వేలు చొప్పున ఆర్ధిక సాయాన్ని అందించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యాయి. దీంతో తమకు డబ్బులు జమ అ-య్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్దిదారులు చూపించారు. మిగతా 2లో...

## కృష్ణమ్మ ఒడి నుంచి..
# పడవల వందనం



- రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో- నిధులు విడుదల
- వంద బోట్లపై వచ్చి సీఎం, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన మత్స్యకారులు
- ఇంటికి ఆహ్వానించి మత్స్యకారులను ప్రశంసించిన మంత్రి నారా లోకేష్ మిగతా 2లో...

## మత్స్యకార కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భోజనం

- కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేసిన సీఎం మిగతా 2లో...



## ఆదరణ 3.0తో శాశ్వత ఉపాధి



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆదరణ 3.0 పథకం ద్వారా బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందజేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం ఆదరణ 3.0 పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తొలుత ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తులకు ఎటువంటి ఆధునిక పరికరాలు ఇవ్వనున్నారో వివరించారు. యువతకు కూడా ఉపాధి లభించేలా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గతంలో ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుడుతున్నారని, ఇందుకోసం రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నారని వెల్లడించారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగా లబ్ధి కలిగేలా ఆదరణ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మిగతా 2లో...

# పల్లె ప్రగతికి పారదర్శక సర్వే

- తద్వారా గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల గుర్తింపు
- పల్లెలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం
- జియో ట్యాగింగ్ తో రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్ కు చెక్
- పల్లె పండుగ 1, 2 ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన
- గిరిజన ప్రాంతాలకు మ్యాజిక్ డ్రెయిన్లు విస్తరణ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం అత్యంత పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు ఏమిటి? ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయనే వివరాలతోపాటు పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, స్మశానవాటికల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వే నివేదికలు ఆధారంగా గ్రామాల్లో భూములకు రక్షణ కల్పించడంతోపాటు ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా నూతన ఆదాయ వనరులను సృష్టించవచ్చని అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోంది. పల్లె పండుగ తొలి విడతలో అనుకున్నట్లుగానే పూర్తిగా 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయింది. అలాగే 2వ విడతలో 2,750 కిలోమీటర్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకంటే ఎక్కువగా 3,580 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాం. మొదటి విడతలో 22,500 గోకులాలు నిర్మించాలనే లక్ష్యానికి గానూ 22,514 పూర్తి చేశాం. రెండవ విడతలో 15 వేల లక్ష్యానికి గానూ 15,303 గోకులాలు నిర్మించాం. పశువుల తాగునీటి అవసరాల కోసం 15వేల లక్ష్యానికి గానూ 15,188 నీటి తొట్టెలు నిర్మించాం. మొదటి విడతలో 20వేల ఫార్మ్ పాండ్స్ లక్ష్యానికి గానూ 21 వేలు పూర్తి చేశాం. రెండవ విడతలో ఈ పనులను భారీగా పెంచి, 81 వేలు లక్ష్యానికి గానూ 2లో...

## పొదుపు ఉద్యమానికి
# ఇ-సైకిళ్ల ఊతం




- స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఇ-సైకిళ్లు
- ఈవీ కంపెనీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్
- ఈవీలు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇంధన పొదుపు కోసం చేపట్టే కార్యాచరణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉద్యమంగా మార్చేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈవీ సైకిళ్లు, ఈవీ వాహనాల ను పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మిగతా 2లో...

## "బలగాల త్యాగాలతోనే నక్సలిజం అంతం: అమిత్ షా"

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రతా బలగాల ధైర్యసాహసాలు, త్యాగాల వల్లే నిర్దేశిత గడువు 2026 మార్చి 31కంటే ముందే దేశం నుంచి నక్సలిజాన్ని అంతం చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన 26వ సెంట్రల్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణమని అన్నారు. కేంద్రం చేపట్టిన నక్సల్స్ రహిత పోరాటానికి చాలా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమకు కనీస సహకారం అందించలేదని ఆరోపించారు. 2023 డిసెంబరు 13న ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ సర్కార్ ఏర్పడిన వెంటనే బస్తర్‌లో మిగిలిన నక్సలైట్లను ఏరివేశామని అమిత్ షా తెలిపారు. బస్తర్ ప్రజలు ఇప్పుడు నిర్భయంగా జీవిస్తున్నారన్న ఆయన, ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన 'వీర్ గుండాధర్ సేవా డేరా' కార్యక్రమాన్ని కొనియాడారు.

"బస్తర్ ప్రజల్లో ఇప్పుడు భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసం, భరోసా వాతావరణం కనిపిస్తోంది. భయానక వాతావరణం, తుపాకుల నీడలో బతకాల్సిన పరిస్థితులు ఇప్పుడు ముగిసిపోయాయి. ఎట్టకేలకు బస్తర్ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటోంది. బస్తర్ నక్సల్ రహిత ప్రాంతంగా మారడం మనందరికీ ఎంతో సంతోషకరమైన విషయం. 2024 ఆగస్టు 24న జరిగిన ఒక సమావేశంలోనే 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేస్తామని ప్రకటించాం. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాల ఫలితంగా మార్చి 31 గడువు తేదీకి ముందే నక్సలిజం పూర్తిగా నిర్మూలించాం. కాగా, 2023 డిసెంబర్ 13న విష్ణు దేవ్ సాయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. అంతకుముందు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేది. నక్సల్ రహిత ఉద్యమంలో బీజేపీయేతర ప్రభుత్వాలు చాలా వరకు మాకు మద్దతు ఇచ్చాయి, కానీ ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాకు మద్దతు ఇవ్వలేదు."



**'అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే' :** "నక్సల్ బరి నుంచి నక్సలిజం విస్తరించడం మొదలైనప్పటి నుంచి దానికి మద్దతిచ్చే మేధావులు ఒక వాదన వినిపిస్తూ వస్తున్నారు.



## మత్స్యకార గడపకు
# కూటమి సంక్షేమం

- మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వంపై విష ప్రచారం సిగ్గుచేటు
- వాస్తవాలు ఒక వైపు... వైసీపీ అబద్ధాలు మరోవైపు
- మత్స్యకారుల ఖాతాల్లో డబ్బులు పడుతుంటే వైసీపీకి నిద్ర పట్టడం లేదు
- అబద్ధాల వల వేసి మత్స్యకారులను మోసం చేయాలనుకుంటున్న వైసీపీ
- వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

3 లో

## ఎంఎస్ఎంఈ పార్కులపై ప్రభుత్వం ఫుల్ ఫోకస్

- ఎంఎస్ఎంఈ పార్కులపై మంత్రి కొండపల్లి సమీక్ష
- 25న చంద్రబాబు ఎంఎస్ఎంఈ ఈవెంట్‌పై చర్చ
- పార్కుల పురోగతిలో వేగం పెంచాలని అధికారులకు ఆదేశాలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశల్లో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ పార్కులపై జరిగిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న పార్కుల పురోగతి, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలా జిల్లాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల పనులు నత్తనడకగా ఉన్నాయని.. వచ్చే రెండు నెలల్లో వాటిని ఓ కొలిక్కి తేవాలని సూచించారు. పార్కుల్లో రహదారులు, విద్యుత్, డ్రైనేజ్‌తో పాటు పూర్తి మౌలిక సౌకర్యాలు కల్పించేలా జిల్లా అధికారులు హెడ్ ఆఫీస్ చీఫ్ ఇంజనీర్లతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. ఏపీఐఐసీ జోనల్ అధికారులు పార్కులను సందర్శించి పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు హెడ్ ఆఫీస్‌తో సమన్వయం చేసుకుంటూ నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. చీఫ్ ఇంజనీర్లు మరియు జోనల్ మేనేజర్ల మధ్య సమన్వయం లేకపోతే పార్కుల నిర్మాణం అనుకున్న టైంలో పూర్తి కాదని హెచ్చరించారు. పూర్తయిన, నిర్మాణ దశలో ఉన్న పార్కుల స్థితిగతులను ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డులో పొందుపరచాలని వీసీఎండీని ఆదేశించారు. 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఔత్సాహికులకు నిర్ణీత సమయంలో అందుబాటులోకి తీసుకువచ్చే విషయంలో ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా ఏపీఐఐసీ ఉ పరిశ్రమల శాఖ వేగంగా పని చేయాలని మంత్రి సుతిమెత్తని హెచ్చరిక జారీ చేశారు. అలాగే ఈ నెల 25న విజయవాడ స్వరాజ్ మైదానంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే ఎంఎస్ఎంఈ కార్యక్రమ నిర్వహణపై ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ తీసుకోవాల్సిన కార్యాచరణ సమీక్షించారు. మిగతా 2లో...

## పల్లె ప్రగతికి పారదర్శక సర్వే



(మొదటి పేజీ తరువాయి)

86 వేలు ఫార్మ్ పాండ్స్ కుంటలను తవ్వించాం. గ్రామాల్లో మురుగునీటి సమస్య నివారణకు పల్లె పండుగ 2.0 కింద సరికొత్తగా 59 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి.

**మ్యాజిక్ డ్రెయిన్లు విస్తరించా:** గ్రామాల్లో మురుగునీటి సమస్యను శాశ్వతంగా అరికట్టేందుకు మ్యాజిక్ డ్రెయిన్స్ విధానాన్ని మరింత ఎక్కువ గ్రామాల్లో ప్రవేశపెట్టాలి. నల్లరేగడి నేలలు, డెల్టా ఏరియాల్లో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుంది కాబట్టి, అక్కడి భూములకు తగినట్లుగా ఈ మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మించాలి. కొండలు, గుట్టలతో కూడిన మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా పరిశుభ్రతను పెంచేందుకు ఈ సరికొత్త డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ పనులు చాలా కాలం మన్నేలా, శాస్త్రీయంగా ఉండటం కోసం నిపుణులైన ఇంజనీర్లు, పారిశుధ్యం-ప్రజారోగ్య నిపుణులు సలహాలు, సూచనలు కచ్చితంగా తీసుకోవాలి.

**రోడ్ల నాణ్యతపై రాజీపడొద్దు :** గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్లు దీర్ఘకాలం మన్నేలా ఉండాలి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి. నాణ్యత లోపిస్తే సహించేది లేదు. సీసీ రోడ్డు వేసిన తర్వాత ఇరువైపులా అలాగే వదిలేయకుండా, మట్టితో పక్కాగా వాలు చేయాలి. వాలు చేయకుండా వదిలేస్తే వాహన ప్రమాదాలు జరిగే అవకాశంతోపాటు వర్షాకాలంలో నీరు నిలిచిపోయి రోడ్డు అంచులు త్వరగా పాడైపోతాయి. పల్లె ప్రజలకు నాణ్యమైన, దీర్ఘకాలం మన్నే రహదారులను అందించడమే లక్ష్యంగా రోడ్లకు జియో మానిటరింగ్ సిస్టమ్ ను తీసుకొచ్చాం. రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్ కు చెక్ పెట్టేందుకు ఈ డిజిటల్ పద్ధతి సహాయపడుతుంది. ఏ గ్రామంలో, ఏ ప్రాంతంలో ఎంతవరకు రోడ్డు పనులు జరిగాయో శాటిలైట్, జియో-ట్యాగింగ్ ద్వారా క్షేత్రస్థాయిలో కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ సాంకేతికత ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా, ఆయా గ్రామాల్లోని రోడ్లను ఇతర ముఖ్య ప్రాంతాల రోడ్లతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. ప్రజలు కూడా రోడ్ల యొక్క ప్రస్తుత స్థితిగతులను ఆన్‌లైన్ ద్వారా నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

**నిర్దేశించిన పనులకే అనుమతులు :** ఉపాధి హామీ నిధులను ప్రభుత్వ నిర్దేశించిన బడ్జెట్ పరిమితి వరకే జిల్లా కలెక్టర్లు మంజూరు చేయాలి. అంతకు మించి అదనంగా ఇవ్వడం వల్ల ప్రభుత్వ లెక్కలకు, క్షేత్రస్థాయి ఖర్చులకు పొంతన లేకుండా పోయి నిధుల దుర్వినియోగానికి, ఆడిట్ ఇబ్బందులకు దారితీస్తుంది. అలాగే ఉపాధి హామీ మార్గదర్శకాల ప్రకారం అనుమతించిన పనులను మాత్రమే గ్రామాల్లో చేపట్టాలి. ప్రభుత్వ నిబంధనల జాబితాలో లేని ఎలాంటి ఇతర పనులను ఉపాధి హామీ కింద చేయడానికి వీలు లేదు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ రామ్ జీ) చట్టాన్ని స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో పనులను సమర్థవంతంగా చేపట్టేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాల"ని చెప్పారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

## పొదుపు ఉద్యమానికి ఇ-సైకిళ్ల ఊతం



(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 16 వేల ఎలక్ట్రిక్ సైకిళ్లను ఆ కార్యాలయాల సిబ్బందికి అందించాలని సీఎం నిర్దేశించారు.

ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేలా రుణాలను అందించే ప్రయత్నం చేయాలని.. దీని కోసం ఓ ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈఎంఐ విధానంలో ఈవీ సైకిళ్లను ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల లాంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లతో పాటు మౌలికసదుపాయాల కల్పించటంపై ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం పేర్కొన్నారు.

## ఆదరణ 3.0తో శాశ్వత ఉపాధి



(మొదటి పేజీ తరువాయి)

కుల వృత్తుదారులకు ఆధునిక పనిముట్లు అందజేయనున్నామన్నారు. లబ్ధిదారులకు వృత్తి నైపుణ్యం పెంచుకునేలా శిక్షణ అందజేస్తామన్నారు. లబ్ధిదారులకు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు ఆదాయం వచ్చేలా యూనిట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదరణ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం ప్రభుత్వమే కల్పిస్తుందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే అన్ని బీసీ కులాల కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకంపై అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. యూనిట్ల మంజూరులో వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు, వివిధ బీసీ కార్పొరేషన్ల ఛైర్మన్లు పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వరరావు, ఆకాశపు స్వామి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ పార్కులపై ప్రభుత్వం ఫుల్ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

అదే రోజు మరిన్ని ఎంఎస్ఎంఈ పార్కులను ముఖ్యమంత్రి ప్రారంభించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకువస్తారని మంత్రి ప్రకటించారు. ఈ సమీక్షలో వీసీఎండీ దినేష్‌కుమార్, ఏపీఎంఎస్ఎండీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ, సెక్రటరీ ఇండస్ట్రీస్ యువరాజ్, ఏపీఐఐసీ ఇంజనీరింగ్ సిబ్బందితో పాటు, జిల్లా జోనల్ మేనేజర్లు ఆన్‌లైన్‌లో సమీక్షలో పాల్గొన్నారు.

# తీరం మనదే... మత్స్య సంపదా మనదే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీరప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ. 288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మవద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్ట్రం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం. మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



**మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్ లా వ్యవహరిస్తా :** "రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్య కారులకే అప్పగించాం. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్య కారులకు అందుబాటులోకి తెస్తాం. మన రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంతంలో నివసించే మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతున్నాం. టెక్నాలజీతోపాటు... వినూత్న పద్ధతుల ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకుంటాం. చేపల వేటకు వెళ్లే మత్స్య కారులకు అండగా నిలబడడమే కాకుండా... మత్స్య కార మహిళలకు ఉపాధి కల్పించి.. ఆర్థిక సాధికారత కల్పిస్తాం. సీవీడ్ కల్చర్ ద్వారా మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం. మత్స్య కార మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు సముద్రపు నాచు పెంపకం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేస్తాం. చేపలు మంచి పౌష్టికాహారం. ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రోటీన్ ఉన్న ఈ ఆహారానికి అన్ని చోట్లా గిరాకీ ఉంది. మత్స్య ఉత్పత్తులకు గిరాకీ సృష్టించేలా మార్కెటింగ్ మేనేజర్ గా వ్యవహరిస్తాను."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**మత్స్య కారుల సేవలో ఉంటాం... అండగా నిలుస్తాం :** "దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇది కొనసాగాలంటే... మత్స్య కారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి... వారికి అండగా నిలవాలి. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మత్స్య కారులకు మేం అండగా ఉంటాం. మెకనైజ్డ్, మోటరైజ్డ్ డీజిల్ పడవలకు లీటరుకు రూ. 9 మేర డీజిల్ సబ్సిడీ ఇస్తున్నాం. 2026-27లో రూ. 50 కోట్ల విలువైన డీజిల్ సబ్సిడీని మత్స్య కార బోట్లకు అందించాం. రూ. 3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. మత్స్య కారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. పడవలు, వలలు, పరిహారం సకాలంలోనే ప్రభుత్వం అందిస్తోంది. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారుల కోసం శాంక్షన్ చేస్తాం. 60 శాతం సబ్సీడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తాం. మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ లభ్యం అవుతాయో అనే సమాచారాన్ని కూడా ఇస్తున్నాం. మెకనైజ్డ్ బోట్లతో సులువుగా చేపల వేట చేసేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఆక్వా కల్చర్ కు అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్ కు రూ. 1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మన రాష్ట్రానికి ఏ రంగంలో ఆదాయం వస్తుందో దానిపై శ్రద్ధ పెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. చేపల వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సేవలో పేరిట రూ. 20 వేల చొప్పున చేయూత అందిస్తున్నాం. రాష్ట్రంలో మత్స్య కారుల సంక్షేమం గురించి నిరంతరం ఆలోచిస్తూ వారిని ఆదుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతీ మత్స్య కార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇచ్చి సాయం చేశాం. 2014-19 మధ్యలోనూ చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 10 వేల వరకూ ఆర్థిక సాయం చేసి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 20 వేలకు ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు :** "గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఎక్కడా అభివృద్ధి చేయలేదు. సంక్షేమం అందించలేదు. అన్ని రంగాలను విధ్వంసం చేశారు.. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. అలాగే మత్స్య రంగం కూడా దెబ్బతినేలా చేశారు. రాష్ట్రానికున్న సుదీర్ఘమైన తీరప్రాంతంలో లక్షల మంది మత్స్య కారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. వారికి నాటి ఐదేళ్ల పాలనలో కష్టాలే ఉన్నాయి. 2019-24 మధ్యలో చేపల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత మత్స్య సంపద పైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారు. ఇలాంటి రంగాన్ని కూడా వాళ్లు విధ్వంసం బాట పట్టించారు. గొడ్డలి పార్టీ లేనిపోని కుట్రలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమం చేస్తుంటే గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి పెద్ద దస్తగిరి వరకూ హత్యలు చేస్తూ... కుట్రలు పన్నుతూ రాష్ట్రాన్ని వెనక్కు లాగుతోంది. వైసీపీ చేసిన విధ్వంసాన్ని సరి చేయడానికి 23 నెలల సమయం పట్టింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటంతో పాటు విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. బుల్లెట్ స్పీడ్ లో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 24 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వస్తాయి. రాయలసీమలో డిఫెన్సు, డ్రోన్స్, స్పేస్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశ్రమలు వస్తున్నాయి. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ తిరుపతి వద్ద బుల్లెట్ మోటారు సైకిల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. నెల్లూరు జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. మరిన్ని వస్తాయి. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతంలో 25 మత్స్య కారుల గ్రామాలను కనెక్టు చేస్తూ మెటల్ రోడ్లు వేస్తాం. నార్త్ బకింగ్ హామ్ కెనాల్ డీసిల్టింగ్ కు రూ. 6.19 కోట్లను మంజూరు చేస్తున్నాం. ఈ కాలువను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ గానూ తీర్చిదిద్దుతాం. ప్రతీ ఇంటిపైనా, పొలంలోనూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు :** "టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారు. బీసీలకు- టీడీపీకి దశాబ్దాల అనుబంధం. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ. 25 వేల వేతనం, వడ్డెర్లకు, గీత కార్మికులకు గనులు, మద్యం దుకాణాలను కేటాయిస్తున్నాం. 45 ఏళ్లుగా బీసీలు టీడీపీని ఆదరించారు. వారి రుణం తీర్చుకుంటాం. బీసీల కోసం... బీసీ మహిళల కోసం కొత్త విధానాలను అమల్లోకి తెచ్చి.. వారిని ఆర్థికంగా చేయూత ఇస్తున్నాం. సీవీడ్ లాంటి కొత్త ప్రత్యామ్నాయాలను ఎంచుకోవటం ద్వారా అదనపు ఆదాయం సంపాదించేలా చర్యలు చేపడతాం. మత్స్య కారుల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య కార యువతకు నైపుణ్యాలు నేర్పి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ప్రయత్నిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా ప్రజల సేవకులే. జవాబుదారీతనంతో పనిచేయాలనే లక్ష్యాన్ని పెట్టాం. పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడింది. ఆయిల్ ధరలు పెరిగాయి. గ్యాస్ కొరత ఉంది. మనం అంతా నా దేశం- నా బాధ్యత అనుకుని పనిచేయాలి. ప్రధాని మోదీ 7 సూత్రాలను సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలి. అనవసరపు ప్రయాణాలు తగ్గించుకుందాం. ప్రజా రవాణాను మాత్రమే వినియోగిద్దాం. బంగారం కొనుగోలును వాయిదా వేద్దాం. టూరిజం కోసం విదేశీ ప్రయాణాలు తగ్గించుకుందాం. మన దేశంలోనే పర్యాటక ప్రాంతాలు, బీచ్ లకు వెళ్లాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**మత్స్యకార మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ :** మత్స్య కారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి తిలకించారు. అలాగే సీవీడ్, తీర ప్రాంత నిఘా కేంద్రాన్ని సందర్శించారు. తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగు చేసేలా మత్స్య కార మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మత్స్యకార మహిళలు అదనపు ఆదాయం పొందేలా సీవీడ్ కల్చర్ చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. తీరప్రాంతాల్లో మహిళలు సముద్రంలో సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు మత్స్యకార మహిళల శిక్షణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్య కారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక వ్యవస్థను అధికారులు సీఎం ఎదుట ప్రదర్శించారు. ఏపీ సరిహద్దుల్లోని సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో హెచ్చరికలు జారీ చేసేలా డ్రోన్లను వినియోగిస్తున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. స్థానిక మత్స్య కార బోట్లు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు హెచ్చరికలు వచ్చే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. ఇక స్థానికంగా పండిన మామిడి కాయలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతును అభినందించారు. డీఆర్డీఓ, వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ ఒడి నుంచి..పడవల వందనం

- రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో- నిధులు విడుదల
- వంద బోట్లపై వచ్చి సీఎం, ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసిన మత్స్యకారులు
- ఇంటికి ఆహ్వానించి మత్స్యకారులను ప్రశంసించిన మంత్రి నారా లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇదొక అరుదైన కృతజ్ఞత. మరో ఆత్మీయ ఆతిథ్యం. రెండింటి కలయికు కృష్ణమ్మ వేదిక అయ్యింది. కూటమి ప్రభుత్వం రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో- నిధులు విడుదల చేయడంతో కృష్ణానదిలో పెద్ద సంఖ్యలో బోట్లు, పడవలతో సీఎం ఇంటి వరకూ వచ్చి చంద్రబాబు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకటపాలెం, తుమ్మలపాలెం, సీతానగరం, కుమ్మర పాలెంలకు చెందిన మత్స్య కారులు సుమారుగా వంద బోట్లలో వచ్చారు. మత్స్యకారులను ఇంట్లోంచి చూసిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వారికి అభివాదం చేస్తూనే..రమ్మంటూ వారిని తన ఇంటికి ఆహ్వానించారు. మత్స్యకారులంతా సీఎం ఇంటికి వచ్చారు.

**మత్స్యకారుల ప్రేమాభిమానాలు మరువలేం :** కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చిన మత్స్యకారులను అభినందించిన మంత్రి లోకేష్ మాట్లాడుతూ-గంగపుత్రులు.. అభిమాన మిత్రులు. యువగళం పాదయాత్ర జువ్వలదిన్నె చేరుకున్నప్పుడు మత్స్యకారుల పట్టుదల, ఐకమత్యం చూశాను. ఊరంతా ముగ్గులు వేశారు. నేను వచ్చేంతవరకూ ఆ ముగ్గులపై ఎవ్వరినీ నడవనీయలేదు. ఊరంతా శుభ్రం చేసి, రంగు రంగుల ముగ్గులతో ఒక పండగలా నాకు స్వాగతం పలికారు. అంతా కలిసి ఒక్క మాట అనుకుంటే, దానిపై నిలబడతారు. మత్స్యకారుల నుంచి ఈ మాట మీద నిలబడే తత్వం అందరం అలవర్చుకోవాలి అని కొనియాడారు.

**మత్స్యకారుల పిల్లలకు మెరుగైన ఉద్యోగాలు :** వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంత ధ్వంసమైందో అందరూ చూశారు. ప్రతీ ఒక్కరూ బాధితులయ్యారు. కంపెనీలు తరలిపోయాయి. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తూనే, ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నాం. గత ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్దుకుంటూ ఇవన్నీ చేస్తున్నాం. మత్స్యకారుల కష్టం నేను కళ్లారా చూశాను. ఇన్ని కష్టాలు పడినా, పిల్లలను బాగా చదివిస్తున్నారు. పిల్లలకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రపంచం మొత్తం తిరిగి కంపెనీలు తీసుకొస్తున్నాం. ఇందులో భాగంగానే జువ్వలదిన్నెలో డిఫెన్స్ కంపెనీకి శంకుస్థాపన చేశాం-- అని లోకేష్ తెలియజేశారు. తమిళ జాలర్లు మన వైపు రాకుండా, వాళ్లకు మనకు మధ్య సర్వేలెన్స్ కోసం అటానమస్ పెట్రోలింగ్ బోటు ను సాగర్ డిఫెన్స్ కంపెనీ ఏర్పాటు చేయబోతోందని తెలిపారు.

**మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి :** మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య అయినా ఎప్పుడూ మా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని లోకేష్ భరోసా ఇచ్చారు. ఇంట్లో కూర్చోబెట్టుకుని మత్స్యకారులందరితోనూ ఆప్యాయంగా మాట్లాడిన మంత్రి.. ఫోటోలు దిగారు. తాము సీఎంకు కృతజ్ఞతలు చెప్పడానికి వస్తే..మంత్రి లోకేష్ తమకు ఆత్మీయ ఆతిథ్యం అందించారని మత్స్యకారులు సంతోషం వ్యక్తంచేశారు.

## "బలగాల త్యాగాలతోనే నక్సలిజం అంతం: అమిత్ షా"



(మొదటి పేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగనందు వల్లే నక్సలిజం ఉద్భవించిందని చెబుతున్నారు. కానీ అది నిజం కాదు. వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే అని స్పష్టంగా అర్థమవుతుంది. దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల కంటే కూడా వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయి. కానీ అక్కడ నక్సలిజం పుట్టలేదు. ఆ ప్రాంతాలు క్రమంగా అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తున్నాయి. మన బస్తర్, ఇతర నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

"బస్తర్ ప్రాంతంతో సహా ఈ జిల్లా మొత్తాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేయాలనే లక్ష్యంతో కేంద్ర హోం శాఖ ఇక్కడ సుమారు 200 భద్రతా శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈ శిబిరాల్లోని జవాన్లు, ఐ=+, ఛత్తీస్‌గఢ్ పోలీసు సిబ్బంది ఆయా ప్రాంతాల భద్రతను పర్యవేక్షించేవారు. అయితే ఇప్పుడు బస్తర్ నక్సల్ రహితంగా మారింది. ఈ నేపథ్యంలోనే మొదటి దశలో భాగంగా అందులోని 70 శిబిరాలను 'వీర్ షహీద్ గుండాధర్ సేవా డేరా'లుగా మార్చాలని మేము నిర్ణయించాము." అని అమిత్ షా పేర్కొన్నారు.

# మత్స్యకార కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భోజనం

**కావలి (జర్నలిస్ట్ ఫైల్) :** నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంటలో ఓ మత్స్యకార కుటుంబం ఇంట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భోజనం చేశారు. మార్కెట్‌లో స్వయంగా చేపలు కొనుగోలు చేసి...స్థానిక మత్స్యకారుని ఇంటికి వెళ్లి వండించుకుని తిన్నారు. కుటుంబ సభ్యుడిలా వారితో కలిసి కింద కూర్చుని భోజనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించారు. కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్నఅనంతరం స్థానిక చేపల మార్కెట్‌ను సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. అక్కడ ఉన్న మహిళా వ్యాపారుల నుంచి చేపలు కొనుగోలు చేశారు. మార్కెట్ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రికి మత్స్యకారుడు తానంగారి బాబు, ఆయన కుమారుడు గిరి స్వాగతం పలికారు. సీఎం తమ మార్కెట్‌కు రావడం పట్ల మత్స్యకారులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.





మత్స్యకారుడు తానంగారి బాబుతో మాట్లాడిన ముఖ్యమంత్రి... వారి జీవనోపాధి, చేపల వేట పరిస్థితులు, మార్కెట్‌లో చేపల విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా ఏడాదికి అందుతోన్న రూ. 20 వేల ఆర్థిక సాయం తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోందని బాబు సీఎంకు వివరించారు. స్థానికంగా లభించే చేపల రకాల గురించి సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

**మత్స్యకారుడి ఇంట...ముఖ్యమంత్రి భోజనం :** మార్కెట్‌లో సందర్శన అనంతరం స్థానిక మత్స్యకారుడు తానంగారి బాబు ఆహ్వానం మేరకు సీఎం వారి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ లో కొనుగోలు చేసిన చేపలు తీసుకుని వెళ్లారు. తానంగారి బాబు సతీమణి వెంకమ్మ ముఖ్యమంత్రి తెచ్చిన చేపలను తమ ఇంట్లో వండారు. వెంకమ్మ చేపల పులుసు పెట్టే సమయంలో సీఎం చంద్రబాబు అక్కడే ఉండి కూర వండే విధానాన్ని పరిశీలించారు. సరదాగా కొద్దిసేపు గరిటె తిప్పారు. ఇటీవల బిడ్డకు జన్మనిచ్చిన వెంకమ్మ కుమార్తెతో మాట్లాడి తల్లీబిడ్డ బాగోగుల గురించి ఆరా తీశారు. వెంకమ్మ చేపల కూర సిద్ధం చేయడంతో వారి ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేశారు. ఈ సందర్భంగా సీఎం స్వయంగా తన చేతులతో వారికి చేపల పులుసును వడ్డించారు. అనంతరం వారితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రూప్ ఫోటో దిగారు. తమ ఇంటికి వచ్చిన ముఖ్యమంత్రికి తానంగారి బాబు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# మత్స్యకార గడపకు కూటమి సంక్షేమం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కుక్క తోక వంకర వైసీపీ నేతల బుద్ధి చిందరవందర అని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజలకు మంచి జరుగుతుంటే జీర్ణించుకోలేక అబద్ధాలు, విష ప్రచారాలతో రాష్ట్రంలో గందరగోళం సృష్టించేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మత్స్యకారుల ఖాతాల్లో కోట్ల రూపాయల సంక్షేమ నిధులు నేరుగా జమ అవుతున్నా, వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వంపై బురదజల్లడం వైసీపీకి, వారి మానస పుత్రిక, అబద్ధాల నిండు కుండ సాక్షి దినపత్రికకు అలవాటైపోయిందన్నారు. గతంలో మత్స్యకారులను మోసం చేసి ఇప్పుడు వారిపట్ల ప్రేమ నటించడం ప్రజలను మభ్యపెట్టే రాజకీయ డ్రామా తప్ప మరొకటి కాదని అచ్చెన్నాయుడు ఘాటుగా వ్యాఖ్యానించారు. మత్స్యకారుల సంక్షేమంపై అసత్యాలు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంత్రి హెచ్చరించారు. సాక్షి పత్రికలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కూటమి ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

గత ఐదేళ్లలో మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిన వారు, ఇప్పుడు మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడటం హాస్యాస్పదం. మా ప్రభుత్వం మాటలు కాదు... నేరుగా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. అర్హులైన ఒక్క మత్స్యకారుడికి కూడా అన్యాయం జరగకుండా పూర్తి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం అని స్పష్టం చేశారు. సముద్ర జీవ సంపదను పరిరక్షించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల చేపల వేట నిషేధ కాలం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సమయంలో ఉపాధి కోల్పోయే సముద్ర మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందన్నారు. గతంలో కేవలం బియ్యం పంపిణీతో సరిపెట్టారని, 2014-15లో రూ. 2 వేల నగదు, 2016-18 మధ్య రూ. 4 వేల సహాయం ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదని గుర్తు చేశారు. 2019లో వేట నిషేధ భృతిని రూ. 10 వేలకు పెంచాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని రూ. 20 వేలకు పెంచి మత్స్యకార కుటుంబాలకు నిజమైన అండగా నిలిచింది అని మంత్రి తెలిపారు. మోటారు లేని పడవల యజమానులు, సిబ్బందిని కూడా పథకం పరిధిలోకి తీసుకొచ్చి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంతృప్తి స్థాయిలో భృతి అందిస్తున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరంలో 1,21,433 మత్స్యకార కుటుంబాలకు రూ. 242.866 కోట్లు చెల్లించామని, 2026-27 సంవత్సరానికి మొత్తం 1,52,248 మంది మత్స్యకారులను గుర్తించి, అందులో 1,30,796 మందికి భృతి చెల్లింపుల కోసం సిఫార్సు చేశామని వెల్లడించారు. ఇందుకోసం రూ. 261.592 కోట్ల బడ్జెట్ ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ. 254.886 కోట్లు విడుదలైనట్లు తెలిపారు.

వైసీపీ హయాంలో సంక్షేమం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. మా ప్రభుత్వం మాత్రం మత్స్యకారుల గడపకు సంక్షేమాన్ని తీసుకెళ్తోంది. జాబితాలను పారదర్శకంగా ప్రచురిస్తూ, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేశాం అని పేర్కొన్నారు. డీజిల్ సబ్సిడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. 2018-19 వరకు లీటరుకు కేవలం రూ. 6.03 మాత్రమే సబ్సిడీ ఇచ్చాం. 2019 నుంచి దాన్ని రూ. 9కు పెంచింది మా ప్రభుత్వమే. మోటరైజ్డ్ పడవలకు నెలకు 300 లీటర్లు, మెకనైజ్డ్ పడవలకు నెలకు 3000 లీటర్ల వరకు, వేట నిషేధ కాలం మినహా సంవత్సరానికి 10 నెలల పాటు సబ్సిడీ అందిస్తున్నాం అని తెలిపారు. ఆూణ స్మార్ట్ కార్డుల ద్వారా కొనుగోలు సమయంలోనే నేరుగా సబ్సిడీ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా మార్చాం. రాష్ట్రవ్యాప్తంగా 98 ఆూణ అవుట్‌లెట్లు, అందులో 8 AF-COF అవుట్‌లెట్లు ద్వారా సబ్సిడీ డీజిల్ అందుబాటులో ఉంది అని తెలిపారు.

ప్రస్తుతం 21,093 చేపల వేట పడవలు ఆూణ డీజిల్ సబ్సిడీ పొందుతున్నాయని, 2025-26లో ఈ సంఖ్య 21,935కు చేరిందన్నారు. 2019-20 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ. 183.04 కోట్ల డీజిల్ సబ్సిడీ మత్స్యకారులకు అందించామని తెలిపారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు నిలిచిపోయాయన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. 2024-25లో 63 క్లెయిమ్‌లకు రూ. 3.15 కోట్లు, 2025-26లో 113 క్లెయిమ్‌లకు రూ. 5.65 కోట్లు చెల్లించామని తెలిపారు. 50 ఏళ్లు పైబడిన మత్స్యకారులకు నెలకు రూ. 4 వేల సామాజిక భద్రతా పింఛన్ అందిస్తున్నామని, 68,632 మంది లబ్ధిదారులకు రూ. 330 కోట్లు చెల్లించామని తెలిపారు. రూ. 2,419.61 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. విశాఖ, కాకినాడ, నిజాంపట్నం, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో మత్స్య మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతోందన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు ముగిశాయి. గణాంకాలు, పారదర్శకత, ప్రత్యక్ష లబ్ధితో కూటమి ప్రభుత్వం మత్స్యకారుల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తోంది. మత్స్యకారుల సంక్షేమంపై ఎవరైనా విష ప్రచారం చేస్తే ప్రజల ముందే అసలు నిజాలు బయటపెడతాం అని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## అంబటి రాంబాబుపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఫైర్



- గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ వార్డుల విభజన అంశంపై స్పందించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ ప్రక్రియ సరైన పద్ధతిలో జరగలేదని, రోడ్డు దాటిన తర్వాత రెండు లైన్లు ఒకవైపు, నాలుగు లైన్లు మరోవైపు కలిపి వార్డులు రూపొందించడం సరికాదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత కమిషనర్, సీపీ సమక్షంలో సమీక్ష నిర్వహించి సరైన విధి విధానాలతో ముందుకు వెళ్తామని తెలిపారు.

వైసీపీ నేత అంబటి రాంబాబు పై విమర్శలు గుప్పిస్తూ...ఆయన దగ్గర వెకిలితనం, అవహేళన, అపవాదులు మోపే తత్వం తప్ప మరేదీ లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న గల్ఫ్ యుద్ధాల కారణంగా పెట్రోల్ ధరలు స్వల్పంగా పెరిగినా, దానికి కూటమి ప్రభుత్వాన్నే కారణమంటూ వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.


గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్ ధరలు భారీగా పెరిగినప్పుడు స్పందించని నాయకులు, ఇప్పుడు మూడు రూపాయల పెరుగుదల పై నిరసన కార్యక్రమాలు చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రజా సమస్యలను సానుకూలంగా ఆలోచించే బదులు, ఎప్పుడూ బురదజల్లే రాజకీయాలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు.

## జన గణనను తనిఖీ చేసిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జనాభా గణనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి మరియు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ పిలుపునిచ్చారు. గుంటూరు మండలం బుడంపాడులో జన గణనను జిల్లా కలెక్టర్ మంగళ వారం తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో చేపడుతున్న ప్రక్రియ, వేగవంతం చేయుటకు అవకాశాలు పరిశీలించారు. ఇళ్ళ వద్ద ఆయా యజమానులతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు మే 1వ తేదీన తమకు కేటాయించిన ఇళ్లను తమ ఎన్యూమరేషన్ కి సంబంధించి హద్దులు సరి చూసుకుని మే 30వ తేదీ వం-కు ప్రతి ఇంటిని సందర్శించి, మ్యాప్ ఆధారంగా సరిహద్దులను గుర్తించి వారి మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. ప్రజలు ఇచ్చే వ్యక్తిగత సమాచారం చాలా సురక్షితంగా ఉంటుందన్నారు. సరైన సమాచారం ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితర ప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందన్నారు. జనాభా గణనలో వివరాలు ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు కోల్పోవడం జరగదని, ప్రజలందరూ ధైర్యంగా, ఖచ్చితమైన సమాచారాన్ని ఎన్యుమరేటర్లకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, తహసీల్దార్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

## కోస్తాలో వడగాల్పుల హెచ్చరిక 7 రోజుల పాటు అత్యవసర ప్రణాళికలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కోస్తాంధ్ర జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వచ్చే ఏడు రోజుల పాటు అన్ని పట్టణ స్థానిక సంస్థలు అత్యవసర వాతావరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించింది. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఈ మేరకు మున్సిపల్ కమిషనర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ్యంగా మధ్య, ఉత్తర కోస్తా జిల్లాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ నెల 26 వరకు వడగాల్పుల తీవ్రత: రేపటి నుంచి ఈనెల 26 వరకు వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎండల బారిన పడే ప్రమాదం ఉన్న ప్రజలను రక్షించడానికి, పౌర సేవలకు అంతరాయం కలగకుండా చూడడానికి వడదెబ్బ మరణాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైకులు, సోషల్ మీడియా, వార్డు సచివాలయాలు, మున్సిపల్ వాహనాలు, మీడియా, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా వడగాల్పుల హెచ్చరికలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

తాగునీటి కియోస్కులు, నీడ ఏర్పాట్లు: బస్టాండ్లు, మార్కెట్లు, కార్మికులు కూడే ప్రాంతాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, అన్నక్యాంటీన్లు ఇతర బహిరంగ ప్రదేశాలలో తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఇందుకోసం తాత్కాలిక వాటర్ కియోస్కులు, అవసరమైన చోట చల్లని నీడ ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసే శ్రామికులు, వీధి వ్యాపారులు, నిరాశ్రయులు, వృద్ధుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుంటూ వార్డు స్థాయి పర్యవేక్షణ బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు.

మధ్యాహ్నం పనుల క్రమబద్ధీకరణ: ఎండలు ఎక్కువగా ఉండే మధ్యాహ్నం వేళల్లో మున్సిపాలిటీకి సంబంధించిన బహిరంగ పనులను క్రమబద్ధీకరించాలని, పారిశుద్ధ్య సేవలు, తాగునీటి సరఫరా, నీటి నాణ్యత పరిశీలన నిరంతరం కొనసాగేలా చూడాలన్నారు. అత్యవసర సేవలు, ఫిర్యాదుల స్వీకరణ కోసం కంట్రోల్ రూమ్‌లను నిరంతరం అందుబాటులో ఉంచాలని సూచించారు. పరిస్థితి తీవ్రతను వివరిస్తూ మున్సిపల్ కమిషనర్లు అంతా క్షేత్రస్థాయి ఏర్పాట్లను ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షించాలని ఎస్. సురేష్ కుమార్ స్పష్టం చేశారు.

## వరుస ఆస్తి దొంగతనాల కేసుల్లో నిందితుడిపై పీడీ యాక్ట్

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలింపు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరుస ఆస్తి దొంగతనాలకు పాల్పడుతున్న చిల్లర సురేష్ అలియాస్ చల్లా సురేష్‌పై గుంటూరు జిల్లా పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

గత రెండు సంవత్సరాల కాలంలో రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 112 ఆస్తి దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పలుమార్లు జైలుకు వెళ్లినా నేరప్రవృత్తిని మార్చుకోకుండా వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాడని తెలిపారు.

గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడిపై సస్పెక్ట్ షీట్ నమోదు చేసి నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వ్యక్తిగా గుర్తించి పీడీ యాక్ట్ అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సి.ఎం. సాయికాంత్ వర్మకు ఎస్పీ నివేదిక పంపించారు.

నిందితుడి నేర చరిత్ర, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణ అంశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ పీడీ యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడు గోరంట్ల గ్రామానికి చెందినవాడని, కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. 2024 నుంచి 2026 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై సుమారు 112 దొంగతనం కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తులు, శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు జిల్లా పోలీసులు హెచ్చరించారు. ఆస్తి దొంగతనాలు, గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, రౌడీషీటింగ్, మహిళలపై నేరాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై అవసరమైతే పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ ప్రజా శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని గుంటూరు జిల్లా పోలీసులు తెలిపారు.

## మళ్లీ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయ్...




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలకు భారీ షాక్ తగిలింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చమురు సంస్థలు లీటరుకు 90 పైసల చొప్పున ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, రవాణా ఖర్చులు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. ఇంధన ధరల తాజా పెంపు మరింత భారంగా మారింది.

తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 111.88కు చేరుకోగా.. డీజిల్ ధర రూ. 99.95గా నమోదైంది. గత వారం కూడా చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో.. కేవలం వారం రోజుల వ్యవధిలోనే రెండోసారి ధరలు పెరగడం గమనార్హం. దీంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇంధన ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో పెట్రోల్ ధరలు మరింత ఎగబాకే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇరాన్ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు సరఫరాపై అనిశ్చితి నెలకొంది. ఈ ప్రభావంతో క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటమే దేశీయంగా ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

అదేవిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం కూడా చమురు దిగుమతుల వ్యయాన్ని పెంచుతోంది. భారత్ భారీగా చమురు దిగుమతులపై ఆధారపడే దేశం కావడంతో అంతర్జాతీయ ధరల మార్పులు నేరుగా దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి.

ఇంధన ధరలు పెరగడంతో త్వరలోనే బస్సులు, క్యాబ్‌లు, సరుకు రవాణా ఛార్జీలు పెరిగే అవకాశం ఉందని ట్రాన్స్‌పోర్ట్ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉండగా.. రవాణా వ్యయం పెరగడం వల్ల మరింత ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న ఇంధన ధరలతో మధ్యతరగతి, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, డెలివరీ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లపై అదనపు భారం పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులను తగ్గించి ప్రజలకు ఊరటనివ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**పెట్రోల్ ధరలు:**
ఢిల్లీలో రూ. 98.64 (ం0.87),
కోల్‌కతాలో రూ. 109.70 (ం0.96),
ముంబయి రూ. 107.59 (ం0.91),
చెన్నై రూ. 104.49 (ం0.82)గా ఉండనున్నాయి.

**డీజిల్ ధరలు:**
ఢిల్లీలో రూ. 91.58 (ం0.91),
కోల్‌కతాలో రూ. 96.07 (ం0.94),
ముంబయి రూ. 94.08 (ం0.94),
చెన్నై రూ. 96.11 (ం0.86)గా ఉండనున్నాయి.

ఇక, తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 111.88కు చేరగా, లీటర్ డీజిల్ ధర రూ. 99.95కి పెరిగాయి. నాలుగు రోజుల క్రితం లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 చొప్పున పెంచాయి. మరోవైపు ధరల నియంత్రణ కోసం కేంద్రం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం వసూలును కూడా తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ క్రమంలోనే మరోసారి ధరలు పెంచడం గమనార్హం..

## 104లో 41 రకాల వైద్య పరీక్షలు - అనుమతించిన ప్రభుత్వం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రప్రభుత్వం 104 మొబైల్ వైద్య యూనిట్ల ద్వారా 41 రకాల వైద్య పరీక్షలను నిర్వహించడానికి అనుమతి మంజూరు చేయడంతో ప్రజలకు ఆరోగ్య సేవల విస్తరణ కొత్త దశలోకి అడుగుపెట్టింది. ఈ 104 వాహనాలను వినియోగించి, రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు నేరుగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో సోమవారం రోజు సంబంధిత ఉత్తర్వులు జారీ చేసింది.

ఏటా రూ. 162.72 కోట్లు ఖర్చుకు అనుమతించిన ప్రభుత్వం : ఈ కార్యక్రమం అమలుకు ఏటా రూ. 162.72 కోట్లు ఖర్చు చేయడానికి పరిపాలనా అనుమతిని కూడా ప్రభుత్వం ఇచ్చింది. ముఖ్యంగా వ్యాధులను ముందుగా గుర్తించి వాటిని నివారించే వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఈ కృషిలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిధులు సమకూర్చుతుందని ప్రభుత్వం వెల్లడించింది.

ప్రతి ఏటా సుమారు 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలనే లక్ష్యంతో ఈ మొబైల్ వైద్య యూనిట్లను సమకూర్చడం జరిగింది. అనగా, 104 వాహనాల్లో ప్రతి ఒక్కటి రోజుకు కనీసం 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాలి. అంతేకాదు ప్రతి యూనిట్ నెలకు కనీసం 26 పని దినాలలో 520 మందికి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఒక యూనిట్?కు నిర్దేశించిన 520 మంది : ప్రతి వీవీఖకి నెలకు రూ. 1.50 లక్షల చొప్పున చెల్లింపు జరుగుతుంది. అయితే ఒక యూనిట్ నిర్దేశించిన 520 మందికి తక్కువగా పరీక్షలు నిర్వహిస్తే ఆ చెల్లింపులో తగిన నిష్పత్తిలో కోత విధించనుంది. ప్రజల ఆరోగ్య స్థితికి సంబంధించిన గ్రామాల వారీగా వివరమైన డేటాను సేకరించడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని లేదా క్లిష్టమైన ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్నవారిని గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించే విధానాన్ని ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రమైన సేవలు : ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కమిషనర్, చీఎవీ డైరెక్టర్, డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవ ట్రస్ట్ జజూలను ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. అంతేకాదు ఈ నిర్ధారణ (డయాగ్నోస్టిక్) సేవలను సక్రమంగా అమలు చేయడానికి పాటించాల్సిన మార్గదర్శకాలు కూడా ప్రభుత్వ ఉత్తర్వులకు జతచేసి 104 సేవలను నిర్వహించే బాధ్యత కలిగిన ఏజెన్సీ ఈ మొబైల్ యూనిట్లలో ఆరోగ్య పరీక్షలన్నీ, ప్రయోగశాల పరీక్షలు, నిర్ధారణ ప్రక్రియలను సులభతరం చేయడానికి డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవ ట్రస్ట్‌తో ఒక అవగాహన ఒప్పందం (వీశిఖ) కుదుర్చుకోవాలని నిర్దేశించింది. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు నేరుగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోగా దీర్ఘకాలికంగా ప్రజల ఆరోగ్య స్థితి మెరుగుపడటానికి ఇది కీలకమైన దశగా నిలవనుంది.

## త్వరలో వార్డుల పునర్విభజన ముసాయిదా విడుదల



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న 57 ఎన్నికల వార్డులను 76 వార్డులుగా పెంపుదల చేసిన పునర్విభజనకు సంబంధించి ప్రతిపాదిత ముసాయిదాను సోమవారం ప్రచురించామని, అందులో ఏమైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ప్రతి రోజు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు, ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సిటి ప్లానర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏసిపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కౌంటర్ లో వ్రాత పూర్వకంగా లేదా జజూ.స్త్రబత్‌బతీఎశీతీజూశీతీఫ్‌అశీఅఏస్త్ర-ఝఅశ్రీ.ఎశీఎ మెయిల్ కి ఆన్‌లైన్ ద్వారా కూడా అందించవచ్చని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల సరిహద్దులతో కూడిన ప్రతిపాదిత ముసాయిదాను అధికారికంగా ప్రచురించి, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించినున్నట్లు, గుంటూరు నగరపాలక సంస్థ వెబ్ సైట్ https://gmc.ap.gov.inలో కూడ అప్ లోడ్ చేశామని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 7,43,354ని 76 వార్డ్ లకు డివైడ్ చేయగా సరాసరి 9,780 వచ్చిందని, అందుకు 10 శాతం హెచ్చు, తగ్గులతో సహజసిద్ధమైన బౌండరీలు వచ్చేలా శాస్త్రీయ పద్ధతిలో వార్డ్ ల విభజన చేసి ముసాయిదాను రూపొందించినట్లు పేర్కొన్నారు. ముసాయిదాపై ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఏవైనా ఉంటే ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగానికి వ్రాతపూర్వకంగా సమర్పించాలని కోరారు.

## 13 ఏళ్ల న్యాయ పోరాట విజయం




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కానిస్టేబుల్ ఉద్యోగం కోసం గిరిజన యువకుడు 13 ఏళ్లుగా సాగించిన న్యాయ పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కింది. తనపై నమోదైన చిన్న కేసు విషయాన్ని అటెస్టేషన్ ఫారంలో వెల్లడించలేదన్న కారణంతో ఉద్యోగం నిరాకరించడం సరికాదని పేర్కొంటూ, ఆయనకు కానిస్టేబుల్ (సివిల్) పోస్టులో నియామకం ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పేద, వెనుకబడిన తరగతులకు చెందిన యువత చేసిన చిన్న తప్పులను జీవితాంతం శిక్షగా మార్చకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. వెనుకబడిన యువతకు అవకాశాలు లేకపోతే వారు అసాంఘిక శక్తుల వైపు మళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేందు శమంతో ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్ ఎంపికను రద్దు చేస్తూ 2011, 2014లో జారీ చేసిన మెమోలను రద్దు చేసింది. నాలుగు వారాల్లో పిటిషనర్‌ను కానిస్టేబుల్‌గా నియమించాలని, వేతనాలు, సీనియారిటీ, ఇతర సేవా ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన గిరిజన యువకుడు దొడ్ల పెంచలయ్య 2008లో కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేశారు. రాత పరీక్ష, శారీరక పరీక్షల్లో అర్హత సాధించి తాత్కాలికంగా ఎంపికయ్యారు. అయితే, గ్రామ రాజకీయ విభేదాల నేపథ్యంలో 2010లో ఆయనపై కేసు నమోదైంది. ఆ కేసులో ఆయన 13వ నిందితుడిగా ఉన్నాడు. ఉద్యోగానికి సంబంధించిన అటెస్టేషన్ ఫారంలో తనపై కేసు లేదని పేర్కొన్నారు. ఆ తరువాత పూర్వచరిత్ర పరిశీలించడంతో ఆ కేసు విషయం బయటపడి ఆయన నియామకాన్ని రద్దు చేశారు. పెంచలయ్య 2013లో న్యాయ పోరాటం ప్రారంభించారు. ఇదే సమయంలో ఆయనపై నమోదైన కేసును కింది కోర్టు కొట్టివేసి నిర్దోషిగా ప్రకటించింది. అయినప్పటికీ ట్రిబ్యునల్, తరువాత సింగిల్ జడ్జి కూడా ఆయనకు వ్యతిరేకంగా తీర్పులిచ్చారు. చివరకు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. పిటిషనర్‌పై నమోదైనది హత్య, దోపిడీ, అత్యాచారం వంటి తీవ్రమైన నేరం కాదని, గ్రామంలో జరిగిన చిన్న ఘర్షణ కేసు మాత్రమేనని ధర్మాసనం పేర్కొంది. గ్రామీణ గిరిజన ప్రాంతానికి చెందిన యువకుడు ఉద్యోగం పోతుందనే భయంతోనే కేసు విషయం వెల్లడించలేదని, దీనిని దురుద్దేశపూర్వకంగా చూడలేమని స్పష్టం చేసింది. సమాచారం దాచిపెట్టిన ప్రతి సందర్భాన్ని ఆటోమేటిక్ అనర్హతగా పరిగణించరాదని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని గుర్తుచేసింది.

## కిషోర బాలికల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు



**-బస్తీ దవాఖానలో రక్తహీనత, డయాబెటిస్‌పై అవగాహన కార్యక్రమం**

**రాయికల్, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని బస్తీ దవాఖానలో కిషోర బాలికలకు రక్తహీనత (అనీమియా), డయాబెటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే ఎంఓ వైద్యురాలు డా. కస్తూరి రేవతి మాట్లాడుతూ కిషోర బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రక్తహీనత మరియు షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రక్తహీనత తీవ్రంగా ఉన్న బాలికలను మెరుగైన చికిత్స కోసం ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తామని చెప్పారుఈ కార్యక్రమంలో బస్తీ దవాఖాన డాక్టర్ సబీర్ మొహమ్మద్, హెల్త్ సూపర్వైజర్ ఉమారాణి, మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, బస్తీ హాస్పిటల్ స్టాఫ్ నర్స్ వసంత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మెప్మా ఆర్పీలు, కిషోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

## డెలివరీ కాని కార్గో వస్తువులకు మే 19న వేలం

**రామ్ మందిర్ ఏరియా, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ కార్గో కార్యాలయం ఆవరణలో మే 19న గురువారం సాయంత్రం 4 గంటలకు డెలివరీ కాని కార్గో వస్తువులకు వేలం నిర్వహించనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఏటీఎం వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.గోదావరిఖని, పెద్దపల్లి బస్టాండ్‌లలోని కార్గో కార్యాలయాల్లో ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్, స్టేషనరీ సామగ్రి, జనరల్ ఐటమ్స్ వంటి వస్తువులను వినియోగదారులు తీసుకుపోకపోవడంతో అవి మిగిలిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వివరించారు.వేలానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9154298557, 9949407275 నంబర్లను సంప్రదించాలని కోరారు

## జీడీకే 1ఎ3 ఇంక్లైన్‌లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం



**రామ్ మందిర్ ఏరియా, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే 1&3 ఇంక్లైన్‌లో సోమవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశానికి గ్రూప్ ఏజెంట్ ఎల్. రమేష్ అధ్యక్షత వహించారు. మొదటి, రెండవ బదిలీల్లో నిర్వహించిన ఈ సమావేశంలో "మన సంస్థ -మన గని - మన బాధ్యత" అనే అంశంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏజీఎం (ఐఈడీ) ఆంజనేయులు మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గనిలోని వివిధ విభాగాల ఉద్యోగులు పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమిష్టి నిర్ణయాల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి గనుల పనితీరు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, నెలవారీ లక్ష్యాలు, ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ-1 ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రటరీ రంగు శ్రీను, ఏజీఎం ఆంజనేయులు, ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, ఏజెంట్ ఎల్. రమేష్, ఎస్‌వోఎం క్వాలిటీ బ్రహ్మాజీ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, గని మేనేజర్ సుదీర్ జక్కుల్‌వార్, ఎస్ఈసీహెచ్ రాజన్న, ఫిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, సంక్షేమాధికారి నిహాల్ సాయి, కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు

## నేడు బంద్‌కు సహకరించండి



**-రాయికల్ మెడికల్ అసోసియేషన్ విజ్ఞప్తి**

**రాయికల్, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలను నియంత్రించడంతో పాటు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని రాయికల్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు కోరారు.సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో నాగార్జున, ఎస్ఐ సుధీర్ రావులకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు గరిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మందులు అవసరమైన వారు ఒక రోజు ముందుగానే కొనుగోలు చేసుకోవాలని సూచించారు. బంద్‌కు ప్రతి మెడికల్ అసోసియేషన్ సభ్యుడు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిరిపురం గణేష్, సభ్యులు గడ్డల శ్రీనివాస్, రంజిత్, నాగమల్ల శ్రీకర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారుల ఇంటర్వ్యూలు



**రాయికల్, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి ఆర్థిక సహాయ పథకాల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలలో బ్యాంకర్లు పాల్గొని అభ్యర్థుల అర్హతలు, ప్రతిపాదిత యూనిట్ల వివరాలను పరిశీలించారు.ఎస్సీ కార్పొరేషన్‌కు 48 మంది దరఖాస్తు చేయగా 43 మంది హాజరయ్యారు. మైనారిటీ కార్పొరేషన్‌కు 40 మంది దరఖాస్తు చేయగా 37 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో చిరంజీవి తెలిపారు.కార్యక్రమంలో, ఎంపీఓ సుష్మ, బ్యాంకర్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా ఆడబిడ్డలు హమాలీలుగా పని చేయడం అభినందనీయం: పెండ్యాల మహేష్



**రామ్ మందిర్ ఏరియా, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ నాయకత్వంలో అంతర్గా మండలం పెద్దంపేట్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల వల్ల రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హమాలీ కార్మికుల కొరతను దృష్టిలో ఉంచుకుని రైతులకు అండగా మహిళలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ అన్నలతో పాటు మహిళలు కూడా పని చేయడానికి ముందుకు రావడంతో, వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. రైతులకు అండగా నిలిచిన మహిళలను రైతులు చప్పట్లతో అభినందించారు.అనంతరం పెండ్యాల మహేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రామగుండంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గెలిచిన తరువాత ఒక్క గింజ కూడా కోత లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. సన్న ధాన్యానికి బోనస్, రైతు రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులకు మేలు జరుగుతోందని చెప్పారు.మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఇటీవల పెద్దంపేట్‌లో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఉచిత కరెంట్ వంటి అంశాల్లో ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని తెలిపారు.అలాగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బహిరంగ చర్చకు రావాలని కోరుకంటి చందర్‌కు సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో అంతర్గా మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం కిరణ్, మాజీ సర్పంచ్ ఆవుల శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ గ్రామ శాఖ అధ్యక్షుడు పల్లె రవీందర్, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి ప్రసాద్, తమ్మనవేని మధు, వేల్పుల కుమార్, పెండ్యాల వెంకటేష్, మెరుగు కుమార్ గౌడ్, తమ్మనవేని రవి యాదవ్, ఆడెపు సంతోష్, అగ్గిల రవి, అఖిల మహేష్, పట్టాని మహేష్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలకు సన్నద్ధమైన ఎల్లమ్మ తల్లి ఆలయం.

**-యర్రగుంట్లలో గ్రామ దేవతకు విశేష బోనాలు పూజా ఉత్సవ కార్యక్రమాలు.**
**-21 నుండి 24 వరకు విశేష పూజా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు.**







**శిరివెళ్ల, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** యుగ,యుగాలుగా తరతరాలుగా పాడిపంటలను పిల్లా, పాపలను సకల మానవాళి శ్రేయస్సు కై సృష్టిలో అభిరుభవించిన గ్రామ దేవతలలో ప్రధానమైనటువంటి అమ్మవారు ఎల్లమ్మ తల్లి. ఈ మహిమాన్వితమైనటువంటి అమ్మవారు కొలువుదీరిన యర్రగుంట్లలో ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు ఉత్సవాలకు సన్నద్ధం అయ్యారు. ఆలయాన్ని అత్యంత ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా విద్యుత్ దీపాలంకరణతో ఉత్సవాలకు సంసిద్ధం చేశారు. మే 21న ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా యజ్ఞ హోమాలు, అభిషేకాలు, కుంకుమార్చన, కాయ కర్పూరం వంటి విశేష పూజా కార్యక్రమాలతో ప్రారంభం అవుతుందని 21న హాజరయ్యే ప్రతి ఒక్కరికి ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు ప్రజలు తెలియజేశారు. 24 మే నెల ఆదివారం కోరిన కోరికలు తీర్చుతూ కొంగు బంగారమై విరాజిల్లుతూ ఉన్న చల్లని తల్లి ఎల్లమ్మ అమ్మవారికి బోనాల సమర్పణ అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. మే24 న సైతం విశేష పూజా కార్యక్రమాలతో పాటు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని చల్లని తల్లి దీవెనలు పొందాలని ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ప్రజలు పిలుపునిచ్చారు.

## గుంటూరులో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ ఆందోళన.

**-కలెక్టర్‌కు వినతిపత్రం. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు.**





**గుంటూరు, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు గుంటూరులో ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాలపై వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు.వైసీపీ నేత నూరిఫాతిమ మాట్లాడుతూ, "అభివృద్ధి కూటమితోనే సాధ్యమని చెబుతున్న నాయకులు ప్రజల అసలు సమస్యలను పట్టించుకోవడం లేదు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై భారీ భారం పడుతోంది" అని అన్నారు.మరావతి అభివృద్ధి పేరుతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన ఆమె, "అభివృద్ధిని AI చిత్రాలతో చూపించడం కాదు.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే నిజమైన అభివృద్ధి" అని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి Y. S. Jagan వీశీష్ట్రుఖఅ Reddy మరియు మంత్రి Nara Lokesh పాలనల మధ్య చాలా తేడా ఉందన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి Ambati Ramyabu మాట్లాడుతూ, "దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అత్యధికంగా ఉన్నాయి" అని ఆరోపించారు. "సంపద సృష్టి, అభివృద్ధి పేరుతో ప్రజలపై భారాలు మోపడం సరైంది కాదు" అని విమర్శించారు.అలాగే మంత్రి లోకేష్‌పై విమర్శలు చేస్తూ, "కమిషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పెట్రోల్ బంక్ యజమానులు కమిషన్లు ఇవ్వరు కాబట్టి ధరల తగ్గింపుపై స్పందించడం లేదు" అని ఆరోపించారు. మరోవైపు, పెరిగిన ఇంధన ధరల వల్ల ప్రతిరోజూ కోట్ల రూపాయల అదనపు భారం ప్రజలపై పడుతోందని పేర్కొన్నారు.జనసేన నాయకులపై కూడా "రెడ్ బుక్ రాజ్యాంగం" అమలు అవుతోందని ఆరోపించిన వైసీపీ నేతలు, ముట్లూరులో జరిగిన ఘటనలో టిడిపి నాయకులు దాడులకు పాల్పడ్డారని అన్నారు. ఈ వ్యవహారంలో దాడి చేసిన వారిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.ఉప ముఖ్యమంత్రి ౖఖుఝుఅ ఖుశ్రీఝుఅ ఆత్మగౌరవాన్ని కాపాడుతానని చెబుతున్నప్పటికీ, కాపు నాయకులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. అయినప్పటికీ జనసేన నాయకులు టిడిపికి మద్దతు ఇస్తే తమకు చెప్పేదేమీ లేదని వైసీపీ నేతలు వ్యాఖ్యానించారు.

## నేడు మెడికల్ షాపులు బంద్




**తాండూర్, మే 19 (జర్నలిస్ట్ ఫైల్)** కేంద్ర ప్రభుత్వం ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలను ప్రోత్సహించడాన్ని నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ చేపడుతున్నట్లు తెలంగాణ మెడికల్ కెమిస్ట్ అండ్ అసోసియేషన్ తాండూర్ మండల అధ్యక్షులు జగన్మోహన్ చారి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తాండూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్లైన్ ఫార్మసీ విధానం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న మెడికల్ షాపుల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఆన్లైన్ మందుల అమ్మకాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ దేశవ్యాప్త నిరసనలో భాగంగా మండలంలోని మెడికల్ షాపుల యజమానులు అందరూ పాల్గొని బంద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బందు సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా అత్యవసర వైద్య సేవలు మందులు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు ఈ మేరకు 9347551355 - 9866004480 నెంబర్లను సంప్రదించాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేసి తాండూర్ తాసిల్దార్, సర్కిల్ కార్యాలయలలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపాముల రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు భోగె శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మామిడాల రాజేశం, బొంతల తిరుపతి, నేరెళ్ల కుమార్, గందే వెంకటరమణ, పాల్గొన్నారు.

## బంగాల్ పేట్ వార్డులో ఇంటింటి జనగణన సర్వే



**-ఎన్యుమరేటర్‌గా ఆకుల భూమేష్ విధుల నిర్వహణ**

**నిర్మల్ జిల్లా, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని బంగాల్ పేట్ వార్డులో జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియకొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆకుల భూమేష్ ఇంటింటికి వెళ్లి కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ సమాచారం, నివాస పరిస్థితులు, వృత్తి, విద్యా స్థితి తదితర అంశాలను డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా అధికారులకుఅవసరమైన సమాచారఅందిస్తూ సహకరిస్తున్నారు.జనగణన ప్రక్రియ పూర్తిగా గోప్యంగా నిర్వహించబడుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా సరైన వివరాలు అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పట్టణాభివృద్ధి ప్రణాళికలు మరింత సమర్థవంతంగా చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.బంగాల్ పేట్ వార్డులో సర్వే కార్యక్రమం క్రమబద్ధంగా కొనసాగుతుండగా, ప్రతి ఇంటి వివరాల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయం

**-మున్సిపల్ ఛైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**
**-ఎన్‌సీసీ సంస్థ ఆర్థిక సహకారం తో కోటి రూపాయల అంచనా వ్యయంతో అదనపు గదుల నిర్మాణం**

**జర్నలిస్ట్ ఫైల్:**గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ సంస్థ ఆర్థిక సహకారంతో సుమారు కోటి రూపాయల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు అంతస్తు గదుల నిర్మాణ పనులను సోమవారం ఆయన వార్డు కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు మున్సిపాలిటీ తరపున ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలో నానాటికీ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కోటి రూపాయల వ్యయంతో అదనపు గదుల నిర్మాణానికి ఎన్‌సీసీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా, నిర్దేశిత గడువులోనే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ?ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి వార్డు కౌన్సిలర్లు రమేష్ కుమార్ గౌడ్ చక్రపాణి సంజీవరెడ్డి కిషన్ కో ఆప్షన్ సభ్యులు ఫయాజ్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి శేఖర్ రెడ్డి మహేష్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## వేంసూర్ మండలం హనుమతండా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న వేంసూరు ఎస్సై కవిత






వేంసూరు, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) : బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు హనుమతండా లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న వేంసూరు ఎస్సై కవిత.పశువుల అక్రమ రవాణాపై 24/7 నిఘా ఉంటుందన్నారు. పశువులను తరలించేటప్పుడు సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండటం తప్పనిసరన్నారు.

## జూన్ 1 వ తేదీన 'గురుడు' రాశి మార్పు తో శుభఫలితాలు

– మిథునం నుంచి కర్కాటకం లోకి 'గురుడు'




ఖమ్మం, ఇల్లందు, (జర్నలిస్ట్ ఫైల్) : నవగ్రహాలలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న, ధన, గౌరవ కారకుడైన గురుడు జూన్ 1 వ తేదీ రాత్రి గం. 1 : 50 ని. లకు మిథున రాశి నుంచి కర్కాటక రాశి లోకి ప్రవేశిస్తాడని సీనియర్ జర్నలిస్ట్, జ్యోతిష్య పండితులు ఎస్ వి సూర్యనారాయణ తెలిపారు. గురుడు ఉచ్ఛ స్థానమైన కర్కాటక రాశిలో ప్రవేశించటం వలన ఐదు రాశుల జాతకులకు శుభఫలితములు కలుగుతాయని ఆయన అన్నారు. గోచారరీత్యా గురుడు జన్మరాశి నుండి 2, 5, 7, 9, 11 స్థానాలలో సంచరించునపుడు శుభ ఫలితాలు ఇస్తాడని ; మిథున, కన్య, వృశ్చిక, మకర, మీన రాశి జాతకులకు గురుగ్రహ రాశిమార్పు వల్ల మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సంవత్సరంలో గురుడు రాశి మార్పు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని వివరించారు. శని ఈ సంవత్సరమంతా మీన రాశిలో సంచరిస్తున్నాడని, 2026 డిసెంబర్ 5 వ తేదీ వరకు రాహువు కుంభరాశిలోను, కేతువు సింహారాశిలోను సంచరించునని, డిసెంబర్ 5 నుండి రాహువు మకర రాశిలో ప్రవేశించునని, కేతువు కర్కాటక రాశిలో ప్రవేశించునని సూర్యనారాయణ తెలిపారు.

## డిజాస్టర్ మేనేజ్ మెంట్ మాక్ డ్రిల్ లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



ఖమ్మం, మే 19(జర్నలిస్ట్ ఫైల్): వరదలు,ప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు, విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియజేసే రాష్ట్రస్థాయి డిజాస్టర్ మేనేజ్మెంట్ మాక్ డ్రిల్ శిక్షణా కార్యక్రమంలో సోమవారం ఖమ్మం జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువ ఆపద మిత్రలు)పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ హాస్పిటల్ ఖమ్మం నందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి యన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గతంలో ఖమ్మం జిల్లా నుండి 87 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉస్మానియా యూనివర్సిటీలో ఆపదమిత్ర శిక్షణ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆపదమిత్ర కోఆర్డినేటర్ ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ యన్. శ్రీనివాసరావు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పిచ్చయ్య, డాక్టర్ స్వాతి, రాజేశ్వరరావు, వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 30 ఫిర్యాదుల స్వీకరణ

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశాలు



(జర్నలిస్ట్ ఫైల్) మల్కాజ్గిరి, మే 19 : మల్కాజ్గిరి జోనల్ కార్యాలయంలో ఆదివారం జోనల్ కమిషనర్ శ్రీ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 30 ఫిర్యాదులను స్వీకరించారు.వాటిలో మల్కాజ్గిరి సర్కిల్‌కు చెందినవి 16, మౌలాలి 7, బోయిన్‌పల్లి 1, ఆల్వాల్ 4, కీసర 2 ఫిర్యాదులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డీడీ యూబీడీ బి. శ్రీధర్‌రావు, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పద్మలత, వెటర్నరీ అధికారి సంజీవ్ రెడ్డి, ఏసీపీ వి.బి. శ్రీనివాస్‌రావు, ఏఎంసీ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వడివడిగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ

మౌలాలి--మల్కాజ్గిరిలో ఎన్యూమరేటర్లతో విస్తృత స్థాయి ఏర్పాట్లు



(జర్నలిస్ట్ ఫైల్) మల్కాజ్గిరి, మే 19 : కేంద్ర ప్రభుత్వం ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు మౌలాలి--మల్కాజ్గిరి ప్రాంతాల్లో వేగంగా కొనసాగుతున్నాయి. కోవిడ్ పరిస్థితుల కారణంగా 2021లో జరగాల్సిన సెన్సస్ ప్రక్రియ వాయిదా పడగా, ప్రస్తుతం సెన్సస్--2027 కార్యక్రమానికి అధికారులు విస్తృత స్థాయిలో చర్యలు చేపడుతున్నారు.జనాభా వివరాల సేకరణలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి సంబంధించిన హెచ్ఎల్‌బీ (హౌస్ లిస్టింగ్ బ్లాక్)లను సిద్ధం చేసి, 34 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ క్రమంలో మౌలాలి, మల్కాజ్గిరి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఎన్యూమరేటర్లు చేరుకుని విధులు ప్రారంభించారు.సెన్సస్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని సెన్సస్ సూపర్‌వైజర్ విలాస్‌రావు విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

– ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

– హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి




హైదరాబాద్, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధి కారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి



పొంగులేటి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్ డిఎంఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు.ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి--కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు.మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు.రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.



## మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటి దంపతులను సన్మానించిన పారిశుద్ధ్య కార్మికులు



ఖమ్మం, మే 19 (జర్నలిస్ట్ ఫైల్) : 5వ డివిజన్, 6వ డివిజన్‌లలో గత 10 సంవత్సరాలుగా పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిన 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరావు ని వారి సతీమణి శైలజ ని పారిశుద్ధ కార్మికులు ఘనంగా సన్మానించారు.ఈ నెల 7వ తేదీతో కార్పొరేటర్ పదవీకాలం ముగిసిన సందర్భంగా గత పదేళ్లుగా డివిజన్లలో అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ పారిశుద్ధ కార్మికులు ఈ సన్మాన కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.డివిజన్ అభివృద్ధిలో కార్పొరేటర్ కోటి ఎల్లప్పుడూ ముందుండి, కార్మికులతో సమన్వయంగా పనిచేస్తూ రెండు డివిజన్‌లను పరిశుభ్రంగా మరియు అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని కార్మికులు తెలిపారు. పారిశుద్ధ్యం , సంక్షేమం, సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నాగండ్ల కోటేశ్వరావు ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు.ఇటు కార్పొరేటర్ అటు పారిశుద్ధ కార్మికులు పరస్పర సహకారంతో పనిచేయడం వల్లే 5వ, 6వ డివిజన్‌లు ఆదర్శ డివిజన్‌లుగా నిలిచాయని కార్యక్రమంలో పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కార్మికులు పుష్పగుచ్ఛాలు అందించి దంపతులను సత్కరించి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ జవాన్ రామకృష్ణతో పాటు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## వికలాంగులకు 5 శాతం కోటా ప్రకారం ఇండ్లు మంజూరు చేయాలి



(జర్నలిస్ట్ ఫైల్) మల్కాజిగిరి , మే 19 : వికలాంగులకు 5 శాతం జీఓ ప్రకారం గృహాలు మంజూరు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్. వినయ్ నేతృత్వంలో ప్రతినిధులు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లగా, ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు ఇప్పటికీ ఇండ్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా దరఖాస్తులు చేసి రెండేళ్లు గడిచినా పరిష్కారం లభించలేదన్నారు. వికలాంగులు, వితంతువులు అద్దె ఇళ్లలో నివసిస్తూ తక్కువ ఆదాయాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొంతమంది కేవలం పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.ఇప్పటికే గృహాలు పొందిన వారి పేర్లతో మళ్లీ దరఖాస్తులు చేసిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన వికలాంగులకు మాత్రమే గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి

: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్– అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో భద్రపరచుకోవాలి– వర్షాకాలం సీజన్‌కు ముందస్తు సన్నద్ధతలో భాగంగా విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ

– మున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం,మే 19 (జర్నలిస్ట్ ఫైల్): వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టీఎస్టీడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చన్నారు.అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది. రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, భూ పత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయంలో వెంట తీసుకుని వెళ్లేందుకు ప్రతి కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు.ప్రజల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన వీడియోలు రూపొందించి వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## గుంటూరులో ప్రధాన రోడ్ల ఆధునికీకరణకు చర్యలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులను ఆధునికమైన మౌలిక వసతులతో అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ సిఎం.సాయికాంత్ వర్మ తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తో కలిసి నగరంలోని కాకాని రోడ్, విఐపి రోడ్, ఆర్టీసి బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ సర్కిల్ నుండి కంకర గుంట ఆర్ఓబీ వరకు, విద్యా నగర్ రోడ్ లను పరిశీలించి, అభివృద్ధి పనులపై తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ తొలుత రోడ్ల అభివృద్ధికి, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ (ఏపియుఐఎయంయల్) ప్రతినిధులు సిద్దం చేసిన ప్రతిపాదనలను పరిశీలించి మాట్లాడుతూ, నగరంలోని ప్రధాన రహదారులను అంతర్జాతీయ ప్రమాణాలతో పచ్చని ల్యాండ్ స్కేపింగ్, వాహనాల పార్కింగ్, వెండింగ్ జోన్స్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్ తో డివైడర్స్, సైన్ బోర్డ్స్, బస్టాప్స్, సోలార్ బ్లింకర్స్, వివిధ ఆకృతులతో స్ట్రీట్ లైట్లు వంటి అంశాలతో సమగ్రమైన డిపిఆర్ సిద్దం చేయాలన్నారు.

కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే ఏపియుఐఎయంయల్ ప్రతినిధులతో కలిసి నగరంలో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించిన రోడ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. ప్రస్తుతం ప్రత్యేక అధికారి సూచించిన అంశాలతో డిపిఆర్ త్వరగా చేయాలని ఏపియుఐఎయంయల్ వారిని ఆదేశించారు.

పర్యటనలో జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఏపియుఐఎయంయల్ ప్రతినిధులు శ్రీ కమల్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

## 21 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పల్నాడు జిల్లాలో 21/5/2026 నుండి ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. జిల్లాలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలలో జరగున్నాయి. పరీక్షల నిర్వహణ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అ-య్యాయి. డి ఈ సి, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్, కస్టడియన్లు, చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ నియామకాలు పూర్తి అయ్యాయి. వారికి సంబంధించిన ట్రైనింగ్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. ఈ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారి నారద ముని హాజరై పలు సూచనలు చేశారు హాల్ టికెట్లు ఇంటర్మీడియట్ బోర్డు వెబ్సైట్ లో మరియు మనమిత్ర వాట్స్ అప్ నందు అందుబాటులో కలవు. పరీక్షల నిర్వహణ కు సంబంధించిన మెటీరియల్ పరీక్ష కేంద్రాలకు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి యం.నీలావతి దేవి తెలియజేశారు.

## వివిఐటి అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** వివిఐటి విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్) విభాగానికి చెందిన షేక్ వసీమ్ అక్రమ్, "డిటెక్షన్ ఆఫ్ పార్కిన్సన్స్ డిసీజ్" (డిటెక్షన్ అఫ్ పార్కిన్సన్స్ డిసీజ్ ) పై చేసిన పరిశోధనలకుగాను జెఎన్టియు అనంతపూర్ (జె ఎన్ టి యు అనంతపూర్ ) నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు విశ్వవిద్యాలయం ప్రో-ఛాన్స్ లర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. వివిఐటి విశ్వవిద్యాలయానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వసీమ్ అక్రమ్ బహుళ పద్ధతులను అవలంబించి పార్కిన్సన్ వ్యాధిని ముందుగానే గుర్తించడంపై పరిశోధనలు చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ ఎ.పి. శివకుమార్ పర్యవేక్షణలో ఆయన సమర్పించిన పరిశోధనా పత్రాలకు గాను ఈ డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ సాధించిన వసీమ్ అక్రమ్‌ను విశ్వవిద్యాలయ ఛాన్స్ లర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, ప్రో-ఛాన్స్ లర్ వాసిరెడ్డి మహదేవ్, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె. గిరిబాబు, మరియు సి. ఎస్. ఎమ్ (సి ఎస్ ఎం ) విభాగాధిపతి డాక్టర్ జి. సంజయ్ గాంధీ అభినందించారు.

# మహిళల జీవనోపాధికి తోపుబండ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ **మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక మహిళా గ్రీవెన్స్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న పేదల సంక్షేమం కోసం తన వంతు సహాయాన్ని అందిస్తాన్ని, ఇందులో భాగంగా మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 3 మహిళలకు వారి జీవనోపాధి కోసం తోపుబండ్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల సమస్యలను నేరుగా తెలుసుకుని, వెంటనే పరిష్కార మార్గాలు చూపించే ఉద్దేశంతో ప్రతి మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమలో మహిళలకు అండగా నిలవడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జీవనోపాధి కోసం టిఫిన్ బండ్లు, కూరగాయల బండ్లు, పూల వ్యాపారం చేసుకునేందుకు బండ్లు కావాలని గత రెండు వారాలుగా మహిళలు విజ్ఞప్తి చేశారని తెలిపారు. వారి అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైన బండ్లను సిద్ధం చేసి ఈ వారం మహిళలకు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే రెవెన్యూ, పోలీస్ స్టేషన్ సమస్యలు, శానిటేషన్, రోడ్లు వంటి ప్రజా సమస్యలతో మహిళలు పెద్ద ఎత్తున తమ వద్దకు వస్తున్నారని, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళలు తీసుకొచ్చిన సమస్యల్లో సుమారు 80 శాతం వరకు పరిష్కారం చేసినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మిగిలిన సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మహిళా నాయకులు, పార్టీ క్యాడర్ సహకారంతో ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

**మహిళలు అందజేసిన వినతులు**

నూనె మరియమ్మ అనే మహిళ తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

సంపత్ నగర్ 9వ లైన్ 2వ అడ్డరోడ్డులో ఇళ్లకు ఆనుకొని విద్యుత్ లైన్ ఉండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నదని కే. శాంతి నాయక్ ఫిర్యాదు చేశారు.

బొడ్డుపల్లి జయలక్ష్మి అనే యువతి తనకు ఉపాధి కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

చెరుకూరి సుబ్బాయమ్మ తన బ్రతుకుతెరువుకు సహాయం చేయాలని కోరగా, బి. నవ్య అనే యువతి 2018-19 సంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్ బకాయిలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆషా అనే మహిళ తాను హృద్రోగ సమస్యతో బాధపడుతున్నానని, వైద్య సహాయం అందించాలని కోరారు.

మదమంచి ఉమా అనే మహిళ అశోక్ నగర్ 1వ లైన్‌లో టీ స్టాల్ ఏర్పాటు చేసుకునేందుకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

షేక్ మౌలాబీ అనే మహిళ కిడ్నీ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

28వ డివిజన్ సీతమ్మ కాలనీ "0" లైన్‌లో నిలిచిపోయిన వాటర్ ప్లాంట్ వద్ద కొంతమంది యువకులు గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మహిళలు ఫిర్యాదు చేశారు. మహిళల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటూ, జీవనోపాధి కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి సేవలను మహిళలు అభినందించారు.

# ప్రతి ప్రాంతంలో అభివృద్ధి వేగవంతం : ఎమ్మెల్యే నసీర్

○ **మౌలిక వసతులకు కల్పనకు అధిక ప్రాధాన్యం**

○ **రూ.1.40 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి వేగవంతం చేస్తున్నామని, ప్రధాన రహదారులను సైతం తీర్చిదిద్దుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక కాకుమాను వారి తోట 4/1 లైన్లో రూ. 80 లక్షలతో సీసీ డ్రెయిన్, పొన్నూరు రోడ్డు లాల్ జాన్ బాషా పార్కు వద్ద రూ. 60 లక్షలతో డయా పైప్ లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్ల నిర్మాణంతోపాటు మెయిన్ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మణిపురం బ్రిడ్జి నుంచి మారుతీ షోరూమ్ వరకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. రైల్వే అధికారులు నెహ్రూనగర్ నుంచి మోతీలాల్ నగర్ మీదుగా రామిరెడ్డి తోట వరకు చేపట్టిన డ్రెయిన్ ఇక్కడ కలుస్తుందని అన్నారు. గత పదేళ్లుగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి దూరమైన అన్ని ప్రాంతాలను ప్రగతి పథంలోకి తీసుకెళు తున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో అక్కడక్కడా ఇబ్బందులు వచ్చినా తాత్కాలికమేనని స్పష్టం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఇటు అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందిస్తున్నామని తెలిపారు. యువత భవిత కోసం రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలతో పెట్టుబడులు తీసుకొస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలను ఎల్లప్పుడూ తాము అందుబాటులో ఉంటామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 25 నుండి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుండి జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలను రెగ్యులర్ పదవ తరగతి విద్యార్థులతో పాటు, ఓపెన్ స్కూలింగ్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు రాయడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 18 పరీక్ష కేంద్రాలలో 3 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుటకు ఎటువంటి అసౌకర్యానికి గురికకుండా బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ప్రాథమిక అవసరాలైన తాగునీరు, విద్యుత్తు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఓఆర్ఎస్ తో పాటు అత్యవసర మందులను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. వేసవి తీవ్రత రీత్యా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించడం జరుగుతుందని, పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాలు జవాబు పత్రాలను ఆయా ప్రాంతాలకు తరలించుటకు అవసరమగు రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా మాట్లాడుతూ 18 పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామని, సిబ్బందిని నియమించామని చెప్పారు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎగ్జామినేషన్ జరుగుటకు అందరు అధికారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీ సీతారామ అభయ వీరాంజనేయ స్వామి వారి 37వ సప్తాహ మహోత్సవాలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండలం బోడపాడు గ్రామంలో శ్రీ సీతారామ అభయ వీరాంజనేయ స్వామి వారి 37వ సప్తాహ మహోత్సవాలు ఘనంగా ముగిసినట్లు కమిటీ వారు తెలిపారు. స్వామివారికి వస్త్రాభిషేకం,ప్రత్యేక పూజలు గ్రామోత్సవం పలు సాంస్కృతిక కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమం గత ఎనిమిది రోజులపాటు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అవినాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా జిల్లా జెడ్పి చైర్మన్ రామ గోవిందరెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ దుగాయమల్లికార్జున్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు బిజి వేముల రామసుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు రత్నకుమార్ యాదవ్ నాగిశెట్టి పల్లె మాజీ సర్పంచ్ వాకమల్ల అనంతరెడ్డి పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి నాయకులు స్థానిక ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## వర్గ పోరాటాలే సుందరయ్యకి నిజమైన నివాళి



**బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** సిపిఎం మొట్టమొదటి జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి బ్రహ్మంగారిమఠం మండంలోని పోలేరమ్మ నగర్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం గోవిందు,నరసింహలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ తాడిత పీడిత వర్గాల ఆశాజ్యోతి సుందరయ్య అని అనేక వర్గ పోరాటాల కు రూపకల్పన చేసి దేశంలో కూలీలకు సంఘాన్ని పెట్టిన గొప్ప వ్యక్తి సుందరయ్యని వారు కొనియాడారు.

తెలంగాణ రైతాంగ పోరాటం బందరు కాలువ పూర్తి అంబలి కేంద్రాలు లాంటి అనేక మహత్తర కార్యక్రమాలకు రూపకల్పన చేసిన వ్యక్తి సుందరయ్య అని వారన్నారు.

ఉత్తమ పార్లమెంటరీగా ప్రజా ప్రతినిధిగా ఆయన సేవలు చిరస్మరణీయ నియమాని వారు కొనియాడారు. సుందరయ్య వేసిన బాటలో నేడు మార్క్సిస్టు పార్టీ ప్రయత్నిస్తోందని భావితరాల భవిష్యత్ కోసం నిస్వార్థంగా పనిచేస్తుందని వారు తెలిపారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరు సల్పాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల మీద భారాలు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఒక చేత్తో ఇస్తూ మరొక చేత్తో రెండింతలు లాకుంటుందని, ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు నిరాశ నిస్పృహ ఉన్నారని అనేక వర్గాల ప్రజలను ఐక్యం చేసి పోరాటాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడకొదటమే సుందరయ్యకి మనం ఇచ్చే ఘన నివాళి అని రాబోయే రోజుల్లో మరిన్ని ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు ప్రభుత్వాలు అవలంబించ ఉన్నాయని, దీని కోసం ప్రజలను సన్నద్ధం చేసే బాధ్యత మార్క్సిస్ట్ పార్టీపై ఉందని దీనికి సీపీఎం శ్రేణులు సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాగరాజు,బుజ్జి,నారాయణమ్మ, గంగమ్మ కులయమ్మ, నాగరాజమ్మ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలకు ప్రభుత్వం హై అలెర్ట్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఈనెల 26 వరకు వడగాల్పుల తీవ్రత పెరిగే అవకాశం – మున్సిపల్ కమిషనర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి – బస్టాండ్లు, మార్కెట్లు అన్నక్యాంటీన్ల వద్ద చలివేంద్రాల ఏర్పాటుకు ఆదేశం – మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతకు గురికాకుండా మున్సిపల్ శాఖ చర్యలు – మున్సిపల్ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది రక్షణకు ప్రత్యేక చర్యలు – ఎండలపై వార్డు సచివాలయాలు ప్రజలకు అవగాహన కల్పించాలి – అత్యవసర సేవలు అందించేందుకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

# జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన కొత్త రెడ్డిపాలెం వాసులు

○ **డయేరియా బాధితులు అందరూ కోలుకున్నారు**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో డయేరియాకు గురైన 60 మంది కోలుకుని ఆనందంగా ఇంటికి వెళ్లారు. ఈ మేరకు కొత్త రెడ్డిపాలెం వాసులు తరుపున కోడూరు బెంజమిన్ జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ మెయిల్ పంపించారు. అందరు కోలుకుని ఇంటికి వెళ్ళడంతో జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సంతోషం వ్యక్తం చేశారు. 15వ తేదీన చేబ్రోలు మండలం కొత్త రెడ్డిపాలెంలో డయేరియా ప్రభలుతున్నట్లు వార్తలు అందిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించడంతో వెంటనే చర్యలు తీసుకోవడం జరిగింది. డయేరియాకు గురైన చివరి వ్యక్తి కూడా కోలుకుని మంగళవారం ఉదయం డిశ్చార్జ్ కావడం జరిగిందని తెలిపారు. 15వ తేదీన జిల్లా కలెక్టర్ స్వయంగా గ్రామంలో పర్యటించి పరిస్థితులను తనిఖీ చేశారు. శాసన సభ్యులు కూడా పర్యటించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

యుద్ధ ప్రాతిపదికన జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టడంతో చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో తలెత్తిన డయేరియా బాధితులు త్వరితగతిన కోల్కొని ఇంటి ముఖం పట్టడం జరిగిందని ఈ సంఘటన రుజువు చేసింది. కొత్త రెడ్డిపాలెంలో కలుషిత ఆహారం తీసుకోవడం వలన డయేరియా లక్షణాలు ప్రబలి పలువురు ఆసుపత్రికి వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దృష్టికి బుధవారం వచ్చిన వెంటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖను తక్షణం రెడ్డిపాలెం సందర్శించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, అవసరమైన అన్ని అత్యవసర మందులతో సహా సిద్ధంగ ఉంచాలని ఆదేశించడం జరిగింది. రెండు అంబులెన్స్ లు ఏర్పాటు చేశారు.

గ్రామ పారిశుధ్యం పట్ల పంచాయతీ వ్యవస్థ ను సంసిద్ధం చేసి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా తాగునీటి వలన డయేరియా అవకాశాలు ఉండవచ్చనే ఆలోచనతో గ్రామీణ నీటి సరఫరా విభాగాన్ని అప్రమత్తం చేసి గ్రామస్తులందరికీ ఆర్.ఓ నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో ఉన్న నీటి వనరుల నమూనాలను సేకరించి వెంటనే తాగునీటి పరీక్షలు చేయించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి, ఇతర జిల్లా అధికారులను అప్రమత్తం చేసి పరిస్థితులను చేయి దాటిపోకుండా చేయుటకు ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతలను అప్పగించి సమయానుకూల నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. దీంతో పరిస్థితులు చేయి దాటిపోకుండా ఉండటమే కాకుండా ఎటువంటి తీవ్ర పరిణామాలకు దారి తీయకుండా నివారించడం జరిగింది. గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన విందులో ఆహారాన్ని తీసుకోవడం, కొంత మందికి ఇళ్లకు వాటిని పంపిణీ చేయడం, వాటిని మరుచటి రోజు ఉదయం, మధ్యాహ్నం తీసుకోవడం వీటికి ప్రధాన కారణంగా ప్రాథమిక విచారణలో వెల్లడి కావడం జరిగింది. ఈ ఆహారం తీసుకోవడం వలన మొదటగా కొంత అస్వస్థతకు గురైన పది మంది మాత్రమే వైద్యశాలకు రావడం, వారి పరిస్థితులను గమనించి వెంటనే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన మేరకు ఐదు బృందాలు ఏర్పాటు చేసి వైద్య ఆరోగ్య శాఖ చేపట్టింది. 102 గృహాలు 912 జనాభా కలిగిన గ్రామంలో 60 మంది ఆరోగ్య అస్వస్థకు గురైనట్లుగా గుర్తించి వారందరికీ స్థానికంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి తరలించి వైద్య సేవలు అందించారు. నలుగురు పరిస్థితి కొద్దిమేర తీవ్రంగా ఉన్నట్లు గమనించడం వారిలో ఒకరు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఉండటంతో వెంటనే వారిని తెనాలిలోని జిల్లా ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. మిగిలిన వారికి స్థానిక వైద్య శిబిరంలో వెంటనే ఫ్లూయిడ్లు, అవసరమైన మందులు అందించి రేయింబవళ్లు మూడు వైద్య బృందాలతో వైద్యులు పర్యవేక్షణ చేయడం జరిగింది. స్థానికంగానే తాజా ఆహారాన్ని కూడా జిల్లా యంత్రాంగం సరఫరా చేయడం, పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం, తాగు నీటిని సరఫరా చేయడం వలన ఎటువంటి తీవ్ర పరిస్థితులకు అవకాశం లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్ ప్రతిక్షణం సంబంధాలతో వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకోవడం మరింత బాధ్యతతో అధికారులు, సిబ్బంది పనిచేయడం ఇందుకు బాగా దోహదం చేసింది. గ్రామస్తులు తీసుకున్న ఆహార నమూనాలను ఆహార భద్రత అధికారుల సేకరించి వాటిని కూడా పరీక్షలకు పంపించడం జరిగింది. ఆహారమే కారణమా లేదా ఇతర వైరల్, బ్యాక్టీరియా వంటి కారణాలు ఏమైనా ఉన్నాయా అని దృక్పథంతో మోషన్ టెస్ట్ లకు కూడా నమూనాలను పంపించి అన్ని వైపుల నుంచి కట్టుదిట్టమైన చర్యలను చేపట్టడం జరిగింది. ఈ చర్యలు భవిష్యత్తులో విపత్తుల సంభవిస్తే వాటికి ఒక మోడల్ గా లేదా ఎస్ఓపి గా వినియోగించుటకు కూడా అవకాశం కలిగిందడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడం వలన ఏ పరిస్థితులు చేయి దాటిపోయే పరిస్థితి ఉండదనే నమ్మకం ఉందని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు. డయేరియా వంటి పరిస్థితులు తీవ్రతరం అయితే మరణాలు కూడా సంభవించే అవకాశం ఉంటుందని, అటువంటి పరిస్థితులకు తావివ్వకూడదనే ఉద్దేశంతో రేయింబవళ్లు పర్యవేక్షణ చేయడం జరిగిందని అన్నారు. చిత్తశుద్ధితో పనిచేయడం వలన దీన్ని సులభంగా నివారించవచ్చని జిల్లా యంత్రాంగం నిరూపించిందని పేర్కొంటూ ఏ కుటుంబమైనా ఒక వ్యక్తిని నష్టపోతే తీవ్రమైన క్షోభ అనుభవిస్తుందని, అటువంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని అన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉండటమే మన తక్షణ కర్తవ్యంగా పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిస్థితులు గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# సెంట్రల్ జి.ఎస్.టి కమిషనర్‌గా అరుణ్ రిచర్డ్ బాధ్యతల స్వీకరణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సెంట్రల్ జి.ఎస్.టి గుంటూరు కమిషనరేట్ నూతన కమిషనర్ గా అరుణ్ రిచర్డ్ గుంటూరు కన్నావారితోటలోని జి.ఎస్.టి ప్రధాన కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2007 సివిల్ సర్వీసెస్ బ్యాచ్ కు చెందిన ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ అధికారి. అరుణ్ రిచర్డ్ విశాఖపట్నం జి.ఎస్.టి, కస్టమ్స్ జోన్ లోని ఐదు కమిషనరేట్లకు అప్పిలెట్ అథారిటీ గా, సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ అప్పీల్స్ కమిషనర్ గా పనిచేస్తూ, గుంటూరు జి.ఎస్.టి కి బదిలీ పై వచ్చారు. కమిషనర్ మాతృబాష తెలుగు. సెంట్రల్ జి.ఎస్.టి కమిషనర్ పరిధిలోకి రాష్ట్రంలోని కోనసీమ జిల్లాలు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలు వస్తాయి. ఈ జిల్లాల్లోని ఐదు జి.ఎస్.టి డివిజన్ కార్యాలయాలకు, 36 జి.ఎస్.టి రేంజ్ ఆఫీసు కార్యాలయాలకు కమిషనర్ ప్రాతినిధ్యం వహిస్తారు. కమిషనర్ నేతృత్వంలో అదనపు కమిషనర్లు, సంయుక్త కమిషనర్లు, డిప్యూటీ మరియు అసిస్టెంట్ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, ఇన్స్పెక్టర్లు పన్ను వసూళ్లపై దృష్టి సారిస్తారు. అరుణ్ రిచర్డ్ నూతనంగా ఛార్జ్ తీసుకున్న సందర్భంగా శాఖాపరంగా వివిధ హోదాలలోని అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఆయనను కలిసి, పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. తొలుత కమిషనర్ కు అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ, జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్, పి.ఆర్.ఓ ఆర్.పి.పి కుమార్ ఘనమైన స్వాగతం పలికారు. సిబ్బంది మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు.

# హోంగార్డు కొడాలి రాజేష్ మరణం బాధాకరం



**తూర్పు లంకపల్లి(ఘంటసాల) (జర్నలిస్ట్ ఫైల్):** హోం గార్డ్ రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సురేష్‌బాబు మచిలీపట్నం ఆర్ పేట లో హోంగార్డు గా పనిచేస్తున్న కొడాలి రాజేష్ అకస్మిక మరణం అత్యంత బాధాకరమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మరణించిన హోంగార్డ్ కొడాలి రాజేష్ స్వస్థలం ఘంటసాల మండలం తూర్పు లంకపల్లి లో గల నివాసానికి సీనియర్ దళిత నేత దిరిశం వెంకట్రావ్ తో కలసి సురేష్‌బాబు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్ లలో పనిచేసిన రాజేష్ అందరితో స్నేహపూర్వకంగా ఉంటూ పలువురి మన్ననలు పొందారన్నారు. డివిజన్ పరిధిలో జూదం,దొంగతనాలు, మాదకద్రవ్యాల వినియోగం లాంటి పలు చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలను నిరోధించేలా క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులకు తన వంతు సేవలు అందించాడని కొనియాడారు. రాజేష్ మరణం పోలీస్ శాఖ తోపాటు తన కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు. రాజేష్ కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారం,కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం తదితర వాటిలో అసోసియేషన్ అండగా ఉంటుందని సురేష్ బాబు వారికి భరోసా ఇచ్చారు.

# ఆక్వా రైతులకు అండగా బీజేపీ



○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ముఖ్యంగా ఇరాన్--అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ముడి చమురు ధరలు పెరిగి దేశీయంగా ఇంధన వ్యయాలు అధికమయ్యాయని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు.

చెరువుల పరిరక్షణ మరియు జనతా వారధి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించారు. క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో డీజిల్, పెట్రోల్ ధరలు ప్రభావితమవడంతో ఆక్వా రంగ నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని తెలిపారు.

ఆక్వా చెరువుల నిర్వహణ, మోటార్ల వినియోగం, ఏరియేటర్లు, రవాణా, ఫీడ్ సరఫరా వంటి అన్ని అంశాలు ఇంధనంపై ఆధారపడినందున రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇప్పటికే ఎగుమతుల మందగమనం, మార్కెట్ అస్థిరత, ఉత్పత్తి వ్యయాల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆక్వా రైతులకు అందుబాటులో తాజా పరిస్థితులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రత్యేకంగా చిన్న, మధ్య తరహా ఆక్వా రైతులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి డీజిల్ సబ్సిడీ, విద్యుత్ రాయితీలు, ఆర్థిక సహాయం, రుణాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై తగిన చర్యలు తీసుకునేలా భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఆక్వా రంగం కీలక పాత్ర పోషిస్తోందని, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని పరిరక్షించడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఆక్వా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యల పరిష్కారానికి బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# పనిచేసే కార్యకర్తలకే బీజేపీలో ప్రాధాన్యం

○ బీజేపీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన శక్తి

○ దేశం ముందు.. రాజకీయాలు తర్వాత అనే భావనతో ముందుకు సాగాలి

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్




**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) :** పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌లో భాగంగా కర్నూలు జిల్లా ప్రశిక్షణ వర్గలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని కార్యకర్తలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ఆలోచనలు, అంత్యోదయ సిద్ధాంతం, పార్టీ సిద్ధాంత బలం, కార్యకర్తల బాధ్యతలు, సమాజ సేవలో కార్యకర్తల పాత్రపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన శక్తి అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే నిజమైన రాయబారులు కార్యకర్తలేనన్నారు.

పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్తల వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక అవగాహన, ప్రజా సమస్యలపై స్పందించే ధోరణి వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అవసరమని పేర్కొన్నారు.

దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణ, సమాజానికి అంకితభావం వంటి విలువలతో కార్యకర్తలు ముందుకు సాగాలని సూచించారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. సోషల్ మీడియా యుగంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పార్టీ సిద్ధాంతాలను వాస్తవాలతో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ ప్రతిష్టను కాపాడే విధంగా ప్రవర్తించాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని అన్నారు.

పార్టీ కష్టకాలంలోనూ అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం బీజేపీ ప్రత్యేకత అని తెలిపారు. కార్యకర్తల సంక్షేమం, భద్రత, రాజకీయ భవిష్యత్తుపై పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. "బలమైన కార్యకర్త – బలమైన పార్టీ – బలమైన దేశం" అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

"దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే అంశంపై మాట్లాడిన మాధవ్, దేశ సమగ్రత, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇదన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలు, దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తుల కుట్రలు, సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశ భద్రత, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక సమగ్రత కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ, ఆర్థిక స్థిరత్వం, అంతర్గత భద్రత విషయంలో దృఢ నిర్ణయాలతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశాన్ని అస్థిరపరిచే శక్తులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. యువత సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, విద్వేష ప్రచారాలను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని సూచించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ లాభాలను ముఖ్యంగా భావించే కొన్ని ప్రతిపక్ష పార్టీల వైఖరి బాధాకరమని విమర్శించారు. ప్రస్తుతం దేశ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ప్రోటోకాల్‌లో భాగంగా కాన్వాయ్‌ను తగ్గించుకొని కేవలం రెండు కార్లతో ప్రయాణిస్తున్నారని తెలిపారు. మోడీని ఆదర్శంగా తీసుకొని ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడంతో పాటు విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

చివరిగా "దేశం ముందు – రాజకీయాలు తర్వాత" అనే భావనతో ప్రతి భారతీయుడు దేశ అభివృద్ధి, భద్రత కోసం ఐక్యంగా ముందుకు రావాలని మాధవ్ పిలుపునిచ్చారు.

# దేవుడి ఉత్సవాలపై కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు తగదు

○ పెళ్లి చేసుకోవాలన్నా పోలీస్‌ల అనుమతులు కావాలా?

○ యం పి అవినాష్ రెడ్డి మండిపాటు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండలం బోడపాడు గ్రామంలో జరిగిన శ్రీ సీతారామ అభయ వీరాంజనేయ స్వామి వారి 37 వ సప్తాహ మహోత్సవాల పై కూటమి ప్రభుత్వం చేసిన కక్ష్య సాధింపు చర్యలు చాలా దారుణమని కూటమి ప్రభుత్వంపై ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భముగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవుడిని సైతం రాజకీయాలోకి లాగుతూ కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని,బోడపాడు గ్రామంలో గత వారం రోజులుగా ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం అడ్డుకుంటుంది. పోలీసులను అడ్డం పెట్టుకొని గ్రామంలోని వైయస్ఆర్ సీపీ నాయకులను వారం రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారు అని ఆయన తెలిపారు. దేవుడితో పెట్టుకుంటే నాశనం అవుతారనేది కూటమి నాయకులు గ్రహించాలని సూచించారు. చివరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్న వాటిని కూడా పోలీసులు అడ్డుకోవడం దారుణమని రాబోయే రోజులో వివాహాలు చేసుకోవాలన్న కూటమి నాయకుల, పోలీస్ ల అనుమతి తీసుకోవాలేమో అని ప్రజలు అనుమానిస్తున్నారని ఆయన అన్నారు. గ్రామంలో వైయస్ఆర్ సీపీ నాయకులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తే పోలీసులను అడ్డం పెట్టుకొని అడ్డుకుంటున్నారని,కూటమి ప్రభుత్వంలో ఇంత అన్యాయమా అంటూ ప్రజలు ఛీ కొడుతున్నారని, దేవుడిని సైతం రాజకీయాల్లోకి లాగడం బాధాకరమని, భవిష్యత్తులో ప్రతిదానికి కూటమి నాయకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో బద్వేల్ ఎమ్మెల్యే సుధా, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కడప జిల్లా జడ్పీ చైర్మన్ రామ గోవిందరెడ్డి బ్రహ్మంగారిమఠం మండల వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఆన్‌లైన్ ఉర్దూ కోచింగ్ తరగతులకు ఆహ్వానం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉర్దూ భాషను నేర్చుకోవాలనుకునే విద్యార్థులు, యువత మరియు ఆసక్తి గల వారికి ఉచితంగా 30 రోజుల ప్రాథమిక ఉర్దూ కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు షేక్ నాగూర్‌వలి తెలిపారు. ఈ ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమం మే 20 నుంచి ప్రారంభమై 30 రోజుల పాటు కొనసాగనుంది.

ఈ కోచింగ్‌లో ఉర్దూ భాషలో చదవడం, రాయడం, మాట్లాడడం వంటి ప్రాథమిక అంశాలను సులభ పద్ధతిలో బోధించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా 10వ తరగతి పూర్తి చేసి ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం తీసుకునే విద్యార్థులు రెండవ భాషగా ఉర్దూను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉర్దూ మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ భాషను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు విద్యా, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ఇంటర్మీడియట్ స్థాయిలో ఉర్దూ చదవడం ద్వారా విద్యార్థులు తమ మాతృభాషను పరిరక్షించుకోవడంతో పాటు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ముందుకు సాగగలరని వివరించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రత్యేక ఉచిత ఆన్‌లైన్ ఉర్దూ కోచింగ్ తరగతులు జూన్ 1 నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఉర్దూ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ తరగతుల్లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచైనా ఈ కోచింగ్‌లో పాల్గొనవచ్చని, ఆసక్తి గల విద్యార్థులు వెంటనే నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: షేక్ నాగూర్‌వలి -- 9885139827.

# నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అఖిల ఆంధ్రప్రదేశ్ నాలుగవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం గుంటూరు జిల్లా నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం గుంటూరు నగరంలోని ఎన్‌జీజీవో హోంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్‌జీజీవో గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి బి. కృష్ణ కిషోర్, సహాయ ఎన్నికల అధికారిగా గుంటూరు సిటీ కార్యదర్శి జీవి కోటేశ్వరరావు, పరిశీలకునిగా జిల్లా కోశాధికారి యల్. శ్రీధర్ రెడ్డి వ్యవహరించారు.

సింగిల్ సెట్ నామినేషన్లు దాఖలు కావడంతో నూతన కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కమిటీలో అధ్యక్షుడిగా పి. కోటేశ్వరరావు, సహాధ్యక్షుడిగా వి. రమేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా బి. వినోద్ చౌదరి, ఎం. వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఎం. సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం. రాణి, సంయుక్త కార్యదర్శులుగా పి. వెంకటేశ్వరరావు, వి. విజయ్ ప్రసాద్, కోశాధికారిగా ఎం. మల్లికార్జున నాయక్ ఎన్నికయ్యారు.

ఎన్నికల అనంతరం జరిగిన సమావేశంలో గుంటూరు జిల్లా జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో నాలుగవ తరగతి ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నూతన కమిటీ సేవాభావంతో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఉద్యోగి అకాల మరణం సంభవించినప్పుడు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తామని నూతన అధ్యక్షుడు పి. కోటేశ్వరరావు ప్రకటించడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ఉద్యోగుల్లో భరోసా పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నాలుగవ తరగతి ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి జేఏసీ, ఏపీ ఎన్‌జీజీవో సంఘం ఎల్లప్పుడూ అండగా నిలుస్తాయని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో జిల్లా కార్యదర్శి ఏ. శ్యాంసుందర్ శ్రీనివాస్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి జి. సుబ్బనారాయణ, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కుల్లాయప్ప, ఏపీ ఎన్‌జీజీవో గుంటూరు సిటీ అధ్యక్షుడు సిహెచ్. కళ్యాణ్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి నరసింహారావు పాల్గొని నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

గుంటూరు, తెనాలి, మంగళగిరి తాలూకా యూనిట్లకు చెందిన వివిధ శాఖల నాలుగవ తరగతి ఉద్యోగులు భారీ సంఖ్యలో ఎన్నికల్లో పాల్గొన్నారు.

నామినేషన్లకు ముందు కలెక్టరేట్ నుంచి ఎన్‌జీజీవో హోం వరకు భారీ ర్యాలీ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# ఆరోగ్య వివరాల డిజిటలీకరణలో ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

○ ఈ - ప్రిస్క్రిప్షన్, ల్యాబ్ టెస్టుల ఫలితాలను ఆన్లైన్లో నమోదు చేయడంలో ముందంజ

○ ఎన్ఐసీ జాతీయ స్థాయి అధికారులు ఆంటోనీ, రవీంద్ర కుమార్ వెల్లడి

○ వైద్యులు, సిబ్బందిలో జవాబుదారీ పెంచుతున్నాం : కార్యదర్శి సౌరబ్ గౌర్

○ వైద్య ఆరోగ్యశాఖ, ఎన్ఐసీ ఆధ్వర్యంలో విజయవాడలో డిజిటలికరణపై జరిగిన కార్యశాల




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రోగుల ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ (ఈ–హస్పిటల్) చేయడంలో పొరుగు రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, జాతీయ సూచన విజ్ఞాన కేంద్రం (నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్) వెల్లడించింది. ఓపీ, ఐపీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇ–ప్రిస్క్రిప్షన్, అభా ఐడీల నేరుగా అనుసంధానం చేయడంలో ముందు ఉన్నట్లు తెలిపింది. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ, లిఎన్ఐసీలి ఆధ్వర్యంలో బోధనాసుపత్రులు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ ఆసుపత్రుల సూపరిటెండెంట్లు, వైద్యులు, సీనియర్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లకు ఈ–హాస్పిటల్ విధానం అమలు, ఉపయోగాలు పై రెండురోజుల కార్యశాల మంగళవారం నుంచి ప్రారంభమైంది ఎన్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.జే ఆంటోనిలి (హెడ్ ఆఫ్ గ్రూపు), డిపార్టుమెంటు హెచ్.ఓ.డి రవీంద్రకుమార్ కార్యశాలలో మాట్లాడుతూ 'నెక్ట్స్ జెన్ ఈ హాస్పిటల్ హెచ్ఎంఐఎస్' (ఆన్లైన్ వెబ్ అప్లికేషన్)లో రోగుల వివరాలను పక్కగా నమోదుచేయడం ద్వారా దేశంలో ఎక్కడికి వెళ్లినా రోగి అనుమతితో ఏబీడీఎం నిబంధనలకు అనుగుణంగా ఉండే ఆసుపత్రులలో అభా నెంబరుతో ఆన్లైన్లో ఉన్న వివరాల ఆధారంగా చికిత్స పొందే అవకాశం ఉందని చెప్పారు.

"దేశ వ్యాప్తంగా 4,003 ప్రభుత్వ ఆసుపత్రులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద 'నెక్ట్స్ జెన్ ఈ–హాస్పిటల్ హెచ్ఎంఐఎస్'కు అనుసంధానం అయ్యా యి. ఈ 4,003లో రాష్ట్రం నుంచి బోధనాసుతపత్రులు, ఇతర స్పెషాల్టీ ఆసుపత్రులు 39, జిల్లా 9, ఏరియా 54, కమ్యూనిటీ ఆసుపత్రులు 179 ఉన్నాయి. ఈ ఆసుపత్రులకు వచ్చే రోగులు ఓపీ, ఐపీలో పొందుతున్న చికిత్స వివరాలు, ల్యాబ్, రేడియాలజీ పరీక్షల వివరాలు ఆన్లైన్లో నమోదవుతున్నాయి. ఇలాంటి చర్యల్లో రాష్ట్రంలో ముందంజలో ఉంది. ఈ విధానం ప్రారంభమైనప్పటి నుంచి ఓపీలో 60.1 కోట్ల వరకు దేశవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు జరిగితే ఇందులో రాష్ట్ర వాటా 10% (6.17 కోట్లు) వరకు ఉంది. ఐపీడీ కేటగిరిలో 1.82 కోట్ల రిజిస్ట్రేషన్లు జరిగితే ఇందులో 35.36 లక్షలు రాష్ట్రం నుంచి ( 20% ) వరకు ఉన్నాయి. రాష్ట్రంలో సగటున ప్రతిరోజూ పదివేల ఐపీడీ కేసులు రిజిస్ట్రేషన్లు (అడ్మిషన్లు) జరుగుతున్నాయి. రేడియాలజీ విభాగంలో 1.62 కోట్ల వరకు పరీక్షలు జరిగితే ఇందులో 50% రాష్ట్రం నుంచి జరుగుతున్నాయి. 4.88 కోట్ల ల్యాబ్ టెస్టుల ఫలితాలను ఆన్లైన్లో రికార్డుచేశారు. ఇందులో రాష్ట్రం నుంచి 3.52 కోట్లు (72%) వరకు జరిగాయి.

**'ఈ-ప్రిస్క్రిప్షన్లో 70% నమోదు :** జాతీయ స్థాయిలో ఈ–ప్రిస్క్రిప్షన్ విధానం అమలులో రాష్ట్రం మరింత ముందంజలో ఉంది. జాతీయ స్థాయిలో 2.91 కోట్ల ప్రిస్క్రిప్షన్లను ఎలక్ట్రానిక్ విధానంలో ఇవ్వగా రాష్ట్రంలో ఈ సంఖ్య 70% (2.03 కోట్లు) ఉంది అభా ఆధారంగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను సృష్టించడంలో ఏపీ లిమంచి పురోగతిని సాధిస్తోంది." అని వివరించారు.

స్పీచ్ టూ టెక్ట్స్ రోగికి మరియు వైద్యులకు మధ్య జరిగే సంభాషణల ఆధారంగా, రోగికి ఉన్న వ్యాధులను గుర్తించి వారి వైద్య రికార్డులను సృష్టించడానికి మరియు వైద్యులు భౌతికంగా రాయవలసిన పని లేకుండా ఉపయోగించే సాఫ్ట్ వేరును అందుబాటులో ఉంచామని " వివరించారు.

**పనితీరుని ఎప్పటికప్పుడు సమీక్షించుకునేలా చర్యలు :** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ మాట్లాడుతూ నెక్ట్స్ జెన్ అప్లికేషన్ ద్వారా వైద్య సిబ్బందిలో బాధ్యత, జవాబుదారీతనాన్ని పెంచుతున్నాం. ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా హాజరు నమోదు చేస్తున్నాశీ వైద్యులు, సిబ్బంది వారి పనితీరును ఆన్లైన్లోనే ఎప్పటి కప్పుడు సమీక్షించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. హెచ్.ఎం.ఐ.ఎస్ హాస్పిటల్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా వైద్య గణాంకాలు అన్నీ నెక్ట్స్ జెన్ అప్లికేషన్లోనే జరగాలి. ఐవీఆర్ఎస్ ద్వారా రోగులు సందర్శించిన ఆసుపత్రి గురించి వారి అభిప్రాయాలను సేకరించి, వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తున్నాం" అని పేర్కొన్నారు.

**వైద్యులు, రోగుల మధ్య జరిగే సంభాషణ కూడా రికార్డు :** ఎన్ఐసీ రాష్ట్ర సూచన, విజ్ఞాన కేంద్రం ఆఫీసర్ ఎస్వీసీహెచ్ సుబ్బారావు మాట్లాడుతూ 'స్పీచ్ టూ టెస్టు' (రోగులు, వైద్యుల మధ్య జరిగే సంభాషణ) గుంటూరు, విజయవాడ జీజీహెచ్ జరుగుతుందని తెలిపారు. రోగులు, వైద్యుల మధ్య జరిగే సంభాషణ ఎలక్ట్రానిక్ రూపంలో నమోదు జరుగుతున్నందు ఈ సమాచార మార్పిడి సదరు ఆసుపత్రుల్లో సులువుగా జరుగుతుందన్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, విజయవాడ జీజీహెచ్లో ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్స్ ద్వారా జరిగే రకరకాల పరీక్షల ఫలితాలు నేరుగా సదరు వైద్యులకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రోగుల చరవాణులకు కూడా సమాచారాన్ని పంపుతున్నామన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక సూచనలు ఇచ్చారన్నారు. ఈ సదస్సులో డీఎంఈ డాక్టర్ రఘునందన్, అదనపు డీఎంఈ డాక్టర్ రాధికారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు నెక్ట్స్ జెన్ ఈ–హాస్పిటల్ విధానం అమలు, ఉపయోగాలు, సాంకేతిక సమస్యలు, పరిష్కారం గురించి అడిగి తెలుసుకున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467